Viswasi Gunaganalu
(Qualities of the believers - Telugu)

# విశ్వాసి గుణగణాలు

రచన
అబుల్ ఇర్ఫాన్

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, సహారాకాంప్లెక్స్,
ఫ్లాట్ నెం.106, పత్తర్‌గట్టి, హైదరాబాద్-2,
ఫోన్ నెం. 040-66710795, 9441515414

వెల..........................................రూ. 25/-లు

Name of the Title: Viswasi Gunaganalu
(Qualities of the believers- Telugu)
Compilation : **ABUL IRFAN**
All rights reserved with: Islamic Resource Centre
First Edition: 11/2010 (Copies-1000)
Published by: Islamic Resource Centre
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 9441515414
Type set by: Alifain, I.R.C. Graphics
Sahara Complex-106, Pathargatti,
Hyderabad-2, Ph: 040-66710795
Printed at: H.S. Offset Printers
714, Chandni Mahal, Daryaganj
New Delhi-2, Ph: 23244240

## విషయ సూచిక

| నెం. | అధ్యాయం | పేజి |
|---|---|---|
| 01. | సదాచరణ సాత్వికులకే శోభిస్తుంది | 04 |
| 02. | ఖుర్‌ఆన్‌లో ఏముందో ఎలా తెలుస్తుంది? | 08 |
| 03. | అనువాదమే మనకు శరణ్యం | 11 |
| 04. | ఖుర్‌ఆన్ ఔన్నత్యం | 17 |
| 05. | నమాజ్ : సదాచరణకు తొలిమెట్టు | 21 |
| 06. | దైవమార్గంలో ధనవినియోగం | 25 |
| 07. | ధన త్యాగం | 31 |
| 08. | అపూర్వ త్యాగం | 36 |
| 09. | దైవభీతి పరాయణత | 39 |
| 10. | సహనం, సాహసం | 43 |
| 11. | నోటి దురుసు, దుర్భాష | 46 |
| 12. | నీతి, నిజాయితీలు | 49 |
| 13. | ప్రాణత్యాగం (జిహాద్) | 54 |
| 14. | ధర్మప్రచారం, సమాజసంస్కరణ | 58 |
| 15. | పరలోక బాటసారి ప్రపంచంలో | 60 |
| 16. | విశ్వాసుల విశిష్ఠ గుణాలు | 63 |

కరుణామయుడు, కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# విశ్వాసి గుణగణాలు

ఇస్లాంలో ప్రవేశించడానికి ఒక ఒప్పందం ఉంది. దేవునికి, దాసునికి మధ్య కుదరవలసిన ఒప్పందం అది. ఏదైనా ప్రాజెక్టు నిర్మాణ పనులు చేపట్టడానికి కాంట్రాక్టర్‌కు, ఇంజినీర్‌కు మధ్య కుదరవలసిన ఒప్పందం లాంటిదే ఈ ఒప్పందం. కాంట్రాక్టర్ చేయవలసిన పనులు, షరతులు, సమయాలు మొదలైన విషయాలన్నీ అగ్రిమెంట్‌లో పొందుపరచడం జరుగుతుంది. వాటన్నిటినీ అంగీకరించి తదనుగుణంగా చేస్తానని కాంట్రాక్టర్ అగ్రిమెంట్‌లో సంతకం చేస్తాడు. ఇంజినీర్ కూడా సాక్షిగా, పర్యవేక్షకుడిగా అందులో సంతకం పెడ్తాడు. ఇలా సంతకాలు అయిన తర్వాత కాంట్రాక్టర్ ప్రాజెక్టు స్వీకరించి పనులు ప్రారంభిస్తాడు. ఇంజినీర్ ఆ పనుల మంచీ- సెబ్బరలు పర్యవేక్షిస్తుంటాడు.

అదేవిధంగా ఇస్లాం స్వీకరణ కోసం మనిషి కొందరు సాక్షుల ముందు ఓ ప్రత్యేక "సద్వచనం" మనస్ఫూర్తిగా పఠించాలి. ఆ సద్వచనం పఠించ గానే అతను దానికి సంబంధించిన విషయాలన్నిటినీ విశ్వసించి, దాని బోధనలన్నిటిని పాటించడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నించాలి.

కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం చేయవలసిన పనుల్లో కొన్నిటిని చేసి కొన్నిటిని మానేస్తే లేక షరతుల్లో కొన్నిటిని ఉల్లంఘిస్తే ఒప్పందం రద్దయి పోతుంది. కాని ఇస్లాంలో దేవునికి, దాసునికి మధ్య కుదిరిన ఒప్పందం రద్దయిపోదుకాని అందులో విధిగా చేయవలసిన పనుల్లో కొన్నిటిని మూర్ఖత్వంతో లేదా కావాలని చేయకుండా మానేస్తే మాత్రం పరలోకంలో వాటికి భారీమూల్యం చెల్లించవలసి వస్తుంది. అంటే దాసుడు కొంతకాలం పాటు నరకయాతనలు చవిచూస్తాడు. ఒకవేళ ఒప్పందంలోని విశ్వాస ప్రకరణలో ఏ ఒక్క విషయాన్ని నిరాకరించినా ఒప్పందం రద్దయిపోతుంది. అంటే ఆ మనిషి ఇక శాశ్వతంగా నరకకూపంలోనే పడివుండవలసి వస్తుంది.



'ఇస్లాం' అనే ఈ ఒప్పందం దస్తావీజుల్లో మనిషి విశ్వసించవలసిన విషయాలు, చేయవలసిన పనులన్నీ ఉంటాయి. వీటన్నిటికీ అతను కట్టు బడివుంటానని, వీలైనంతవరకు పాటిస్తానని అంగీకరిస్తూ "సాక్ష్య సద్వచనం" (కలిమాషహాదత్) పఠించాలి. అంటే "అష్‌హదుఅన్ లాఇలాహ ఇల్లల్లాహు, వఅష్‌హదుఅన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహూ" (అల్లాహ్ తప్ప మరే ఆరాధ్యుడు లేడని; ముహమ్మద్ ఆ దేవుని దాసుడు, ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను) అని పలకాలి. దాంతో మనిషి 'విశ్వాసి'గా మారి ముస్లింసముదాయంలో చేరిపోతాడు.

## సదాచరణ సాత్వికులకే శోభిస్తుంది-1

అయితే మనిషి విశ్వాసిగా మారిన తర్వాత ఆ విశ్వాసానికి సంబంధించిన విధులు, బాధ్యతలు నిర్వహించినపుడే అతను దేవునితో చేసుకున్న ఒప్పందం ఫలవంతమవుతుంది. మనిషి మనస్ఫూర్తిగా ఇస్లాంను విశ్వసిస్తే దాని ప్రభావం అతని దైనందిన జీవితంలో, వివిధరంగాల్లో కన్పిస్తుంది.

విశ్వాసికి ఇహలోకం సేద్యభూమి లాంటిది. అతనిక్కడ పూర్తి విశ్వాస స్ఫూర్తితో 'సదాచార'సేద్యం చేస్తే, దానికి సరైన, శాశ్వతమైన ప్రతిఫలం పరలోకంలో లభిస్తుంది. విశ్వాసంలేని సదాచరణ ఎలా నిరర్థకమో, అలా సదాచరణలేని విశ్వాసం కూడా నిష్ప్రయోజనమే.

దైవప్రవక్త (స) ఇలా తెలిపారు: "దేవుడు విశ్వాసంలేని సదాచరణను, సదాచరణలేని విశ్వాసాన్ని (ఎన్నటికీ) స్వీకరించడు." (ఇస్లామీ నజర్య)

చెట్టు మొలకెత్తి పెరగడానికి 'విత్తనం' ఎంత ముఖ్యమో ఆచరణకు విశ్వాసం కూడా అంతే ముఖ్యం. కాని కేవలం విత్తనం నాటినంత మాత్రాన చెట్టు మొలకెత్తి పెరిగిపోదు. దానికి నేల అనువైనదిగా ఉండాలి. విత్తనం మొలకెత్త డానికి మొట్టమొదటి షరతు- నేల సారవంతమైనదిగా ఉండాలి.

"సారవంతమైన నేల తనప్రభువాజ్ఞతో పుష్కలంగా మంచి పంటనిస్తుంది. సారంలేని చవిటినేల నాసిరకాన్నే ఉత్పత్తి చేస్తుంది." (ఖుర్ఆన్-7:58)

ఇక్కడ సారవంతమైన నేలంటే మనిషి స్వభావంలో 'దైవభీతిపరాయణత' ఉండాలని చెప్పుకోవచ్చు. విత్తనం మొలకెత్తడానికి ఏవిధంగా సారవంతమైన నేల మొట్టమొదటి షరతో, అదేవిధంగా మనిషి హృదయంలో దైవభీతి పరాయణత కూడా మొట్టమొదటి షరతుగా ఉంది. దీన్ని గురించి రాబోయే పేజీల్లో (ఖుర్ఆన్-2:2 సూక్తి) చూడండి.

సారవంతమైన నేలలో విత్తనం నాటిన తర్వాత ఎరువు వేయాలి; నీరు పోయాలి; కలుపుమొక్కలు పీకేయాలి; చీడపురుగులు పట్టకుండా మందు చల్లాలి. చెట్టు పెరిగి ఫలపుష్పాలతో వికసించి ప్రయోజనం చేకూర్చడానికి ఇలా అనేక జాగ్రత్తలు తీసుకుంటూ దాన్ని కంటికి రెప్పలా కాపాడుకోవాలి.

అదేవిధంగా 'విశ్వాస' వృక్షం ఫలపుష్పాలతో వికసించాలంటే సృష్టికర్త నిర్దేశించిన విధులు పాటించాలి; ఆయన నిరోధించిన చెడులు మానెయ్యాలి. విశ్వాసాలే ఆచరణలకు ఆధారాలు. ఆచరణలేని విశ్వాసం నిరర్థకం. దేవుని ఆజ్ఞల్ని, ఆయన ప్రవక్త (స) బోధనలను ఆచరించకుండా వారుభయుల్ని విశ్వాసించానని చెప్పుకోవడం 'తోటలో ఒక్క చెట్టు కూడా మొలకెత్తకపోయినా యజమాని ఇచ్చిన విత్తనాలన్నీ నాటానని వాదించడం లాంటిదే. ఇస్లాం స్వీకరించిన మనిషి ఇస్లాంకు అనుగుణమైన జీవితం గడపడం వల్లనే పరలోకంలో మోక్షం పొందగలుగుతాడు.

"దేవుడు శిష్టవచనాన్ని దేనితో పోల్చాడో మీరు గమనించారా? ఓ మేలు జాతివృక్షం ఉంది. దాని వేళ్ళు నేలలో లోతుకు దృఢంగా పాతుకుపోయాయి. దానిశాఖలు ఆకాశం దాకా విస్తరించాయి. అనుక్షణం అది తన ప్రభువాజ్ఞతో సుమధుర ఫలాలు ఇస్తోంది. ప్రజలు గుణపాఠం నేర్చుకోవడానికే దేవుడు ఇలాంటి ఉదాహరణలు ఇస్తున్నాడు. దీనికి భిన్నంగా దుష్టవచనాన్ని నేల ఉపరితలం నుండి పెరికివేసే నాసిరకం చెట్టుతో పోల్చవచ్చు. దానికి ఎలాంటి స్థిరత్వమూ, దృఢత్వమూ ఉండవు." (ఖుర్ఆన్-14:24-26)

"ఆయన దగ్గరకు సద్వచనం మాత్రమే అధిరోహిస్తుంది. ఈ సద్వచనాన్ని సదాచరణ మాత్రమే పైకి అధిరోహింపజేస్తుంది." (ఖుర్ఆన్-35:10)



**సదాచరణ కోసం సన్మార్గం కావాలి :-** సదాచరణ కోసం విశ్వాసి సన్మార్గం అవలంబించాలి. ఆ సన్మార్గం ఖుర్ఆన్ మాత్రమే చూపుతుంది. దైవధర్మాన్ని విశ్వసించిన దాసులు సృష్టికర్త, సర్వశక్తిమంతుడయిన తమ ఆరాధ్యుడ్ని ఇలా వేడుకుంటాడు:

"దేవా! మేము నిన్నే ఆరాధిస్తున్నాము. నీ సహాయమే అర్థిస్తున్నాం. మాకు రుజుమార్గం చూపు. నీ ఆగ్రహానికి గురయి దారితప్పినవారి మార్గం కాకుండా, నీ అనుగ్రహానికి పాత్రులైనవారి మార్గమే మాకు చూపించు." (ఖు: 1:4-7)

ఈ వేడుకోలుకు సమాధానంగా దేవుడు 'మీరు కోరుతున్న రుజుమార్గం ఇదేనంటూ వారి ముందు మొత్తం ఖుర్ఆన్ని ఉంచాడు. అయితే దేవుని పట్ల ఫలప్రదమైన భయభక్తులు (Result oriented Piety) కలవారికి మాత్రమే ఖుర్ఆన్ సన్మార్గం చూపుతుంది. ఈ క్రింది సూక్తులు చూడండి:

"అలిఫ్-లామ్-మీమ్. ఇది ఎలాంటి సందేహానికి ఆస్కారంలేని (దైవదత్త) గ్రంథం. ఈ గ్రంథం భయభక్తులు కలవారికి సన్మార్గం చూపుతుంది. వారు 1-అగోచరాలు, అతీంద్రియాలను విశ్వసిస్తారు; 2-నమాజ్(వ్యవస్థ) స్థాపిస్తారు; 3-మేము ప్రసాదించిన సంపద నుండి (మామార్గంలో) ఖర్చుపెడతారు; 4-నీపై అవతరించిన ఈ గ్రంథాన్ని, నీకు పూర్వం గత ప్రవక్తలపై అవతరించిన గ్రంథాలను విశ్వసిస్తారు. 5-పరలోకాన్ని కూడా విశ్వసిస్తారు. అలాంటి దైవభీతిపరులే తమ ప్రభువు నుండి వచ్చిన రుజుమార్గంలో నడిచేవారు. అలాంటివారే సాఫల్యం చెందేవారు; మోక్షం పొందేవారు." (ఖుర్ఆన్-2:1-6)

మనిషి ఇస్లాం స్వీకరించగానే అతను షరీఅత్ (ధర్మశాస్త్రం) దృష్టిలో, తోటివిశ్వాసుల దృష్టిలో విశ్వాసిగా పరిగణించబడతాడు. అయితే దేవుని దృష్టిలో ఆ మనిషి నిజమైన విశ్వాసిగా పరిగణించబడాలంటే అతనిలో దైవభీతిపరాయణత ఉండాలి. అంటే అతను ఎల్లప్పుడూ, ప్రతి విషయంలోనూ దేవునికి భయపడుతుండాలి. ముస్లిమేతరుల్లో, ఆచరణశూన్యులైన ముస్లిముల్లో చాలామంది తమకూ దేవుని పట్ల భయభక్తులు ఉన్నాయని అంటారు. కాని అవి ఎలాంటి భయభక్తులు?

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి." (ఖుర్‌ఆన్–2:102)

సరయిన భయభక్తులు ఉండే మనిషి స్వభావంలో పైసూక్తుల్లో (2:3,4) పేర్కొనబడిన అయిదు సుగుణాలు ఉండితీరాలి. అయితే కేవలం ఈ అయిదు సుగుణాలతో దైవభీతిపరాయణతా పరిధి పూర్తి కాదు. మనిషి అంతర్యంలో దైవభీతి ఉందనడానికి ఇవి కనీస లక్షణాలు మాత్రమే. ఇస్లాం స్వీకరించిన మనిషి దైవభీతి పరాయణతలో మరింత ముందుకు పోవడానికి ఈ 5 లక్షణాలు అతని స్వభావంలో తప్పకుండా ఉండాలి. అలాంటి దైవభీతిపరులకే ఖుర్‌ఆన్ రుజుమార్గం చూపుతుంది.

రుజుమార్గం, సన్మార్గం, సత్యమార్గం ఎల్లప్పుడూ మానవులందరికీ ఒకటిగానే ఉంటుంది. దాన్ని నిర్ణయించవలసిన బాధ్యత సృష్టికర్తపైనే ఉంది. మానవుని మనోమస్తిష్కాలపై జాతి, భాష, ప్రాంతం మొదలైన వాటికి సంబంధించిన అభిమానాలు నిరంతరం ప్రభావితం చేస్తుంటాయి. వాటికి అనుగుణంగా అతను నిర్ణయాలు తీసుకుంటాడు. ఫలితంగా కొందరికి నచ్చిన విషయాలు మరికొందరికి నచ్చకపోవచ్చు. కనుక మానవులకు సరైననిర్ణయం, సమగ్రన్యాయం జరగాలంటే జీవన విధానానికి సంబంధించిన రుజుమార్గాన్ని సృష్టికర్త మాత్రమే నిర్దేశించాలి.

సృష్టికర్త ఈ రుజుమార్గాన్ని ఖుర్‌ఆన్‌ద్వారా మానవులకు తెలియజేశాడు. కనుక విశ్వాసులు ఆ రుజుమార్గం ఏమిటో తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ రుజుమార్గం గురించి తెలుసుకొని, దానికి అనుగుణంగా ఆచరిస్తేనే వారి విశ్వాసానికి సరైన సార్థకత చేకూరుతుంది. అప్పుడే వారు సాఫల్యానికి, మోక్షానికి అర్హులవుతారు.

ఇహలోకంలో చేస్తున్న కర్మలకు పరలోక న్యాయస్థానంలో సమాధానం చెప్పుకోవలసి ఉంటుందన్న భావనతో దేవునికి భయపడేవారే ఖుర్‌ఆన్ పట్ల ఆసక్తిచూపుతారు. అందులోని విషయాలు తెల్సుకోడానికి ఉవ్విళ్ళూరుతారు. అలాంటి విశ్వాసుల హృదయాలనే దైవవాణి ఆకర్షిస్తుంది.



"విశ్వప్రభువుకు భయపడేవారు ఈ వాణి వినగానే వారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి; వారి శరీరాలు జలదరిస్తాయి; వారి హృదయాలు మెత్తబడి దేవుని ప్రస్తావన వైపుకు మొగ్గుతాయి." (ఖుర్‌ఆన్–39:23)

"ఇది మానవులందరి కోసం అవతరించిన విశ్వజనీన సందేశం. (పరలోక) పరిణామాలను గురించి ప్రజలను హెచ్చరించడానికి, వారు దేవుడు ఒక్కడేనని తెలుసుకోవడానికి, బుద్ధిజ్ఞానం కలవారు స్పృహలోకి రావడానికి ఈ సందేశం పంపబడింది." (ఖుర్‌ఆన్–14:52)

## ఖుర్‌ఆన్‌లో ఏముందో ఎలా తెలుస్తుంది-2

దేవునికి భయపడేవారు ఖుర్‌ఆన్‌వాణి వినగానే వారి రోమాలు నిక్కబొడుచుకుంటాయని, వారి శరీరాలు జలదరిస్తాయిని, వారి హృదయాలు మెత్తబడి దేవుని ప్రస్తావన వైపు మొగ్గుతాయని 39వ అధ్యాయం 23వ సూక్తి తెలుపుతోంది. పరలోక పరిణామాలను గురించి ప్రజలను హెచ్చరించడానికి, బుద్ధిజ్ఞానాలుకలవారు స్పృహలోకి రావడానికి దైవవాణి పంపబడినట్లు 14వ అధ్యాయం 52వ సూక్తి చెబుతోంది.

ఇవన్నీ మనకు ఎలా తెలుస్తాయి? మనకు స్పృహ ఎలా వస్తుంది? పరలోకంలో సంభవించే దుష్పర్యవసానాల నుండి మనం ఎలా తప్పించుకోగలం? ఈ ప్రశ్నలకు ఖుర్‌ఆన్ ఇలా సమాధానమిస్తోంది:

"ప్రజలు స్పృహలోకి వచ్చేందుకు ఖుర్‌ఆన్‌లో మేము అనేక తార్కాణాలు పేర్కొన్నాం. వారు దుష్పర్యవసానం నుండి తప్పించుకోవడానికే మేము దీన్ని (వారికి తెలిసిన) అరబీభాషలో అవతరింపజేశాము." (ఖురాన్–39:27,28)

ప్రజలు స్పృహలోకి రావడానికి, పరలోక దుష్పరిణామాల నుండి తప్పించుకోవడానికి అరబీభాషలో అవతరించిన ఖుర్‌ఆన్ పఠించి తెలుసుకోవాలని పైసూక్తుల ద్వారా తెలుస్తోంది. ఖుర్‌ఆన్ ప్రపంచ మానవులందరి కోసం అవతరించింది. అయితే ప్రపంచ మానవులందరికీ అర్థమయ్యే సమగ్రమైన అంతర్జాతీయభాష ఏదీ ఏ కాలంలో కూడా లేదు. అంచేత

అరేబియాలో అరబ్బుల కోసం ఖుర్‌ఆన్ అరబీ భాషలో అవతరించడం సహజమే. అరబీలో కాకుండా తెలుగు భాషలో అవతరించి ఉంటే అరబ్బులు ఏం అంటారు?

"ఒకవేళ మేమీ గ్రంథాన్ని అరబ్బేతర ఖుర్‌ఆన్‌గా చేసివుంటే, వారు (విమర్శిస్తూ) 'దాని సూక్తుల్ని (మా భాషలో) ఎందుకు విడమరచి చెప్పలేదు? ఇదేమి చోద్యమో! సంబోధితులు అరబ్బులయితే, ఈగ్రంథం అరబ్బేతర భాషలోనా!?' అంటారు." (ఖుర్‌ఆన్–41:44)

"మేము పంపిన ప్రతి ప్రవక్తా విషయం విడమరచి చెప్పడానికి వీలుగా తన జాతిప్రజలు మాట్లాడే భాషలోనే మా సందేశం అందజేశాడు." (14:4)

"అదేవిధంగా మక్కావారిని, దాని చుట్టుప్రక్కల ప్రాంతాలవారిని హెచ్చరించడానికి మేమీ ఖుర్‌ఆన్‌ని అరబీభాషలో నీ వద్దకు పంపాము." (42:7)

"ఇవి సత్యాన్ని స్పష్టంగా తెలియజేసే గ్రంథానికి చెందినసూక్తులు. మేము దీన్ని పఠనగ్రంథంగా చేసి, విషయాన్ని అర్థంచేసుకోవడానికి వీలుగా అరబీభాషలో అవతరింపజేశాం." (ఖుర్‌ఆన్–12:1,2; 43:2)

"ఈ గ్రంథం యావత్ మానవాళికి మార్గదర్శిని. ఇందులో రుజుమార్గం తెలిపే, సత్యాసత్యాలను, మంచీచెడులను వేరుపరచి చూపే స్పష్టమైన బోధనలు ఉన్నాయి." (ఖుర్‌ఆన్–2:185)

ఇస్లాం పేర్కొన్న సత్యసత్యాలు, మంచీచెడులు ఏమిటో అరబ్బేతరులైన మనం తెలుసుకోవాలంటే మనకు తెలిసిన భాషలో ఖుర్‌ఆన్ అనువాదం చదవక తప్పదు. నిజంగా తెలుసుకోవాలన్న ఆసక్తి, పట్టుదల ఉంటే, పరలోకంలో నరకయాతనల బారినుండి తప్పించుకోదలచుకుంటే ఖుర్‌ఆన్ అనువాద గ్రంథం తప్పకుండా చదవాల్సిందే.

"(ముహమ్మద్!) ఏమైనప్పటికీ నీవు మటుకు దివ్యావిష్కృతి ద్వారా నీ దగ్గరకు పంపబడిన ఈ గ్రంథాన్ని దృఢంగా పట్టుకో. నిస్సందేహంగా నీవు సన్మార్గంలో ఉన్నావు. ఈగ్రంథం నీకు, నీజాతి ప్రజలకు గొప్ప హితకారిణి.



త్వరలోనే మీరంతా దీని విషయమయి (దేవుని సమక్షంలో) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది." (ఖుర్‌ఆన్–43:44)

ఖుర్‌ఆన్ విషయంలో దేవుని ముందు సమాధానం చెప్పుకోవలసి ఉంటుందని పైసూక్తి ముస్లింలను హెచ్చరిస్తోంది. మరి నేటి ముస్లింలు దేవునికి ఏం సమాధానం చెప్పుకుంటారు? "మేము ఖుర్‌ఆన్ పఠిస్తూనే ఉండేవాళ్ళం కదా!"అని సమాధానం చెబుతారా? "అయితే దాని ప్రకారం మీరెందుకు ఆచరించలేదు?" అనే మరోప్రశ్న ఎదురవుతుంది. దానికి ఏమని సమాధానమిస్తారు? "ఖుర్‌ఆన్‌భాష మాకు తెలియదు. అందువల్ల మేము దాని ప్రకారం ఆచరించలేకపోయాం" అని సమాధానమిస్తారా? "ఖుర్‌ఆన్ భాష ఎందుకు నేర్చుకోలేదు లేదా మీకు తెలిసిన భాషలో దాని అనువాదం ఎందుకు చదవలేదు?" అనే వేరొక ప్రశ్న కూడా ఎదురు కావచ్చు. దానికి వివరణ ఏం ఇచ్చుకుంటారు?

ముస్లింలు ఖుర్‌ఆన్‌ని విశ్వసించామని చెప్పుకుంటారు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడం అంటే ఏమిటీ? దాన్ని భక్తిశ్రద్ధలతో పారాయణం చేసి కళ్ళ కద్దుకోవడమేనా? కాదు. ఖుర్‌ఆన్‌ని విశ్వసించడమంటే మన దైనందిన జీవితంలో దాని బోధనలు అమలుపరచాలి; అది ఆదేశించిన విషయాల్ని ఆచరించాలి; అది నిషేధించిన విషయాల్ని మానెయ్యాలి. ఈ విషయం గురించే దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు:

"ఎవరు ఖుర్‌ఆన్ నిషేధించిన విషయాల్ని ధర్మసమ్మతం చేసుకున్నాడో అతను నిజానికి ఖుర్‌ఆన్‌ని విశ్వసించనే లేదు." (తిర్మిజి)

"దైవగ్రంథం ప్రకారం ఆచరించేవాడు ఇహలోకంలోనూ మార్గభ్రష్టుడు కాలేడు, పరలోకంలోనూ తన ప్రతిఫలాన్ని కోల్పోలేడు."ఇలా చెప్పి ఆయన "నా హితబోధను అనుసరించేవాడు ప్రపంచంలోనూ దారితప్పడు, పరలోకంలోనూ దౌర్భాగ్యానికి గురికాలేడు" అన్న ఖుర్‌ఆన్ సూక్తి పఠించారు. (ఇబ్నెఅబ్బాస్-మిష్కాత్)

# అనువాదమే మనకు శరణ్యం-3

ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకుంటూ పఠిస్తున్నప్పుడే అందులోని బోధనలను ఆచరించడానికి వీలవుతుంది. రోజుకు ఐదుసార్లు నమాజ్ చేయాలని ఇవ్వబడిన దైవాజ్ఞ వెనుక 'నమాజులో భక్తులు పఠించే సూక్తుల్ని ఆచరణలో పెట్టాలన్న' లక్ష్యమే ఉంది. ఈ లక్ష్యం ఉండటం వల్లనే "నిస్సందేహంగా నమాజ్ (మనిషిని) చెడులు, అశ్లీలచేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది" అని ఖుర్‌ఆన్ పేర్కొన్నది. (29:45)

ఖుర్‌ఆన్‌ని అర్థం చేసుకున్నప్పుడే నమాజ్ మనిషిని చెడులు, అశ్లీల చేష్టల జోలికి పోకుండా నిరోధిస్తుంది. ఖుర్‌ఆన్ భాష అర్థంకానప్పుడు వేరే సమయంలో దాని అనువాదాన్ని మనకు తెలిసిన భాషలోనైనా చదువుకోవాలి. ఇలా ఒక విషయాన్ని మాటిమాటికి చదవడం వల్ల అది మనల్ని ఆచరణ వైపు ప్రేరేపిస్తుందని ఆశించగలం.

ఖుర్‌ఆన్ నిజధ్యేయాన్ని, దాని ఆశయాల్ని విస్మరించి దాని సమక్షంలో కొందరు హదీసుకు ప్రాధాన్యమిస్తున్నారు. మరికొందరు ఫిఖా విషయాలకు ప్రాధాన్యమిస్తున్నారు. ఇంకా కొందరైతే ఖుర్‌ఆన్, హదీసు గ్రంథాలను వదలిపెట్టి కొన్ని ఖుర్‌ఆన్ సూక్తులు, కొన్ని హదీసు ఉల్లేఖనాలతో కూడిన ఓ పుస్తకం పట్టుకొని 'ఇందులోనే అన్నీ ఉన్నాయి, ఇక వేరే ఖుర్‌ఆన్, హదీసులు చదవనవసరం లేదు' అంటున్నారు, అదేదో సర్వరోగ నివారిణి అయినట్లు.

ముస్లింల ఈ అజ్ఞాన వైఖరినే ఎత్తిచూపిస్తూ దైవప్రవక్త (సల్లం) ఇలా అన్నారు: "వారు ఖుర్‌ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుకపైనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు." (మిష్కాత్)

ఈ కారణాలగానే చాలామంది ముస్లింలు రోజుకు అయిదు పూటలా నమాజ్ చేస్తున్నప్పటికీ అబద్ధమాడటం, వాగ్దానభంగం చేయడం, మోసగించడం, ఇతరుల హక్కుల్ని కొల్లగొట్టడం, మంచివాళ్ళపై అపనిందలు మోపడం, వడ్డీ వ్యవహారాలు నడపడం, కుమార్తెలకు ఆస్తివాటాలు ఎగవేయడం, లక్షల రూపాయల కట్నాలు గుంజడం, నిషిద్ధవస్తువుల వ్యాపారం చేయడం, బలహీనుల్ని దోచుకోవడం, పరస్త్రీలను తదేకంగా చూడటం, వెకిలిచేష్టలకు పాల్పడటం మానుకోలేక పోతున్నారు. ఇలాంటి ముస్లింలు చేసే నమాజ్‌ని దేవుడు ఎలా స్వీకరిస్తాడు?



వీటన్నిటికి పరిష్కారం రెగ్యులర్‌గా ఖుర్‌ఆన్‌ని అధ్యయనం చేయడమే. ఖుర్‌ఆన్ అధ్యయనమే మానేస్తే ఇక దేవునికి, దాసునికి సంబంధం ఏముంటుంది? ఇలాంటి మనిషికి సమాధిలో ఖుర్‌ఆన్ సహాయపడుతుందని చెప్పగలమా? అతని మోక్షంకోసం దేవుని దగ్గర సిఫారసు చేస్తుందని ఆశించగలమా? ఇస్లాంవ్యతిరేక శక్తులు ముస్లింలను ఖుర్‌ఆన్‌కు దూరంగా ఉంచడానికి రకరకాల కుట్రలు పన్నుతున్న ఈనాటి కాలంలో ముస్లింలు తీవ్రంగా ఆలోచించవలసిన విషయమిది.

మహాప్రవక్త (సల్లం) మహితోక్తి : "దేవుడు ఈగ్రంథం ద్వారా కొందరిని ఉద్ధరిస్తాడు; మరికొందరిని అణగద్రొక్కుతాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి: "ఖుర్‌ఆన్ కలిగివున్న ప్రజలారా! ఖుర్‌ఆన్‌ని తలగడగా చేసుకోకండి. దాన్ని పఠించవలసిన విధంగా పఠిస్తూ ఉండండి. రేయింబవళ్ళూ పఠిస్తూఉండండి. దాన్ని బహిరంగంగా పఠించండి. మంచి స్వరంతో పఠించండి. అందులోని విషయాలను పరిశీలించండి, ఆలోచించండి- తద్వారా మీరు సాఫల్యభాగ్యం పొందగలరని ఆశించగల్గుతారు. దాని ప్రతిఫలం మీకు పరలోకంలో తప్పక లభిస్తుంది. అంచేత ప్రపంచంలో దాని ప్రతిఫలం పొందడానికి ప్రయత్నించకండి." (బైహఖీ)

ఇప్పటిదాకా పైన పేర్కొనబడిన ఖుర్‌ఆన్ సూక్తులను, హదీసు ఉల్లేఖనాలనుబట్టి ప్రతిముస్లిం షరీఅత్ ఆచరణ కోసం ఖుర్‌ఆన్‌ని తప్పకుండా అధ్యయనం చేస్తుండాలని అర్థమవుతోంది. మన దేశంలో ముస్లిమేతర కుటుంబంలో జన్మించి ఇస్లాం స్వీకరించిన నవముస్లిమైనా, ముస్లిం

కుటుంబంలోనే జన్మించి ధార్మికస్పృహ కలిగిన పాతముస్లిమైనా, ఇస్లాం స్వీకరించిన లేక ధార్మికస్పృహ కలిగిన మరుక్షణం నుంచే ఖుర్ఆన్ అనువాదం అధ్యయనం చేయడం అతని ప్రప్రథం కర్తవ్యం. ఈ కర్తవ్యం విస్మరించి లేదా ఏమరుపాటుకు లోనయి లేదా నిరాధారమైన మాటలు విని ఖుర్ఆన్ అనువాదానికి దూరమయి కూపస్థ మండూకంలా జీవితం గడిపితే పరలోకంలో తీవ్రమైన పరిణామాలకు గురికావల్సి వస్తుంది.

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి) ఖుర్ఆన్ గురించి ఇలా వివరించారు: "ఖుర్ఆన్ దేవుడు దించిన విస్తరి. కనుక దేవునివిస్తరి దగ్గరకు మీరు ఎన్ని సార్లు వెళ్లగలిగితే అన్నిసార్లువెళ్లి అందులోనివి ఆస్వాదించండి. ఈ ఖురాన్ దేవుని సామిప్యానికి చేర్చే (అత్భుత) సాధనం; కారుచీకట్లను పటాపంచలు చేసే కాంతిపుంజం; స్వస్థత, ప్రయోజనం చేకూర్చే దివ్యౌషధం. దీన్ని గట్టిగా పొదివి పట్టుకునేవారికి ఇది రక్షణ కవచం; దీన్ని అనుసరించేవారికి ముక్తిమార్గం, మోక్షప్రదాయని. ఇది పాఠకుల్ని అమితంగా ఆకట్టుకునే పాఠ్యగ్రంథం. ఇందులో ఎలాంటి వక్రత లేదు, కనుక దీన్ని సరిచేయవల సిన అవసరమే రాదు. అత్భుతమైన దీని భావసంపద ఎన్నటికీ తరగదు. ఇది ఎంత వాడినా పాతబడని (పట్టు)వస్త్రం లాంటిది." (ముస్తద్రక్)

**జ్ఞానార్జన ఆవశ్యకత :–** దైవప్రవక్త (స) తన అనుచరులకు విద్యావశ్య కతను తెలుపుతూ "జ్ఞానార్జన ప్రతిముస్లిం విధి" అన్నారు. (జామె బయానుల్ ఇల్మ్)- ఆయన మరో సందర్భంలో "మీరు కూడా విద్య నేర్చుకోండి, మీస్త్రీలకు కూడా నేర్పండి" అని చెప్పారు. (దార్మి)

దైవప్రవక్త (స) వేరొక సందర్భంలో ఇలా అన్నారు : "చదువు నేర్చుకోండి. చదువు ధర్మాధర్మాల విచక్షణ నేర్పుతుంది, స్వర్గవాసుల దారి చూపుతుంది; భయాందోళనల సమయంలో ప్రేమాభిమానాలు జనింపజేస్తుంది; ఒంటరి తనంలో సహచరిగా ఉంటుంది; పేదరికంలో మార్గదర్శిని; శత్రువుల్ని ఎదు ర్కోవడానికి మంచిఆయుధంగా ఉపయోగపడుతుంది. విద్య స్నేహితులకు ప్రాణమిత్రుడు; విద్యవల్లనే దేవుడు జాతులకు ప్రగతివికాసాలు ప్రసాది



స్తాడు; విద్య మూలంగానే ప్రజలు సజ్జనుల్ని తమ నాయకులుగా, మార్గద ర్శులుగా చేసుకుంటారు; ఆ సజ్జనుల ఆచరణలు ప్రజలు అనుసరించేవిగా ఉంటాయి; వారి అభిప్రాయాలకు విలువనిస్తారు." (బయానుల్ ఇల్మ్)

అసలు ఖుర్ఆన్ అవతరణే ఇలా 'చదువు' అనే మాటతో ప్రారంభమైంది: "సర్వసృష్టికర్త అయిన నీప్రభువు పేరు స్మరించి పఠించు." (96:1)

దైవప్రవక్త (స) విద్యను నిర్వచిస్తూ ఇలా ప్రవచించారు: "మూడు విషయాలను గురించిన జ్ఞానార్జనే విద్య అనబడుతుంది. ఒకటి, మనిషి ఖుర్ఆన్‌లోని స్పష్టమైన సూక్తులు నేర్చుకోవాలి; రెండు, లేదా నిరూపిత సంప్రదాయాలను(హదీసుల్ని) నేర్చుకోవాలి; మూడు, లేదా న్యాయవంతమైన ధనవిభజనకు సంబంధించిన విద్య నేర్చుకోవాలి." (అబూదావూద్)

"దేవుని దాసులలో జ్ఞానులు మాత్రమే దేవునికి భయపడతారు." (ఖుర్ఆన్–35:28)

దేవునికి భయపడేందు జ్ఞానార్జన కావాలి. జ్ఞానార్జన అంటే 1-చదవడం, వ్రాయడం నేర్చుకోవడంతో పాటు, 2-సాత్వికజీవితం గడపడానికి ఇస్లామీయ జ్ఞానం ఆర్జించాలని అర్థం.

ఇస్లామీయజ్ఞానం లేకపోతే మనిషికి ధర్మంఏదో-అధర్మం ఏదో, పాపమేదో-పుణ్యమేదో, మంచేదో-చెడేదో ఎలా తెలుస్తుంది? షిర్క్-తౌహీద్‌ల సమగ్రరూపం, వాటి తేడా ఎలా తెలుస్తుంది? దేవుని హక్కులేమిటో, దాసుల హక్కులేమిటో ఎలా తెలుస్తాయి? ఆస్తిపంపకంలో, ఇతర ఆర్థిక వ్యవహారాలలోని దైవాజ్ఞలు ఎలా తెలుస్తాయి? సామాజికవిషయాలు ఎలా తెలుస్తాయి? ఖుర్ఆన్ మనిషిని ఎలా తీర్చిదిద్దదలచిందో ఎలా తెలు స్తుంది? ఇస్లాంపట్ల సరైనఅవగాహన లేకపోతే ఇస్లాంవ్యతిరేక శక్తుల పట్ల ఎలా వ్యవహరించగలం? అందుకే ఇస్లాం జ్ఞానార్జనకు పెద్ద పీట వేసింది.

"(సత్య)జ్ఞానం ఉన్నవాళ్లు, జ్ఞానం లేనివాళ్లు ఒకటేనా అని అడుగు వారిని. (మా) హితబోధను బుద్ధిమంతులే స్వీకరిస్తారు." (ఖుర్ఆన్–39:9)

దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుడు ఎవరికైనా మేలు చేయదలచుకుంటే అతనికాయన ధర్మజ్ఞానం, ధర్మావగాహనాభాగ్యం ప్రసాదిస్తాడు." (బుఖారి)

మహాప్రవక్త (స) ఇలా ప్రవచించారు : "సాధారణ నక్షత్రాలపై పౌర్ణమి చంద్రుడికి ఎలాంటి ఘనతాఔన్నత్యాలున్నాయో, సాధారణ భక్తులపై పండితులకు అలాంటి ఘనతాఔన్నత్యాలే ఉన్నాయి. పండితులు దైవప్రవక్తల వారసులు. దైవప్రవక్తలు తమ వారసత్వంలో ధనకనక వస్తువులకు బదులు విద్యను వదలిపెట్టారు. కనుక ఎవరైతే (ధర్మ)జ్ఞానం సంపాదించాడో అతను పెద్దఎత్తున ధనాన్ని సంపాదించినట్లే." (అహ్మద్, తిర్మిజి)

హజ్రత్ అబూమూసా (రజి) ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "దేవుడు నాకిచ్చి పంపిన మార్గదర్శకత్వం, విద్యాజ్ఞానాలు నేలపై కురిసే వర్షం లాంటివి. ఆ నేలలో కొంత సారవంతమైనది. అది (వర్షపు) నీటిని పీల్చుకొని పచ్చిక చెట్లుచేమలను మొలకెత్తించింది. ఆ నేలలోని మరి కొంతభాగం బంజరు భూమి. అది (నీటిని పీల్చుకోలేకపోయినా) నిల్వచేసి ఉంచింది. ఆ నీటితో దేవుడు ప్రజలకు ప్రయోజనం చేకూర్చుతాడు. వారా నీటిని త్రాగుతారు (పశువులకు) త్రాగిస్తారు, పంటపొలాల కోసం కూడా వినియోగిస్తారు.

ఆ వర్షమే మెట్టపల్లాలులేని చదునైననేలపై కూడా కురిసింది. కాని ఆ నేల వర్షపునీటిని నిలిపి ఉంచడంగాని, పచ్చికను మొలకెత్తించటం గాని చేయజాలదు. ఈ ఉదాహరణలు దైవధర్మాన్ని అర్థం చేసుకున్న వ్యక్తికి వర్తిస్తాయి. దేవుడు నాకిచ్చి పంపిన జ్ఞానం,సన్మార్గాలతో అతనికి ప్రయోజనం చేకూర్చాడు. అతను (ధర్మ)జ్ఞానం ఆర్జించి (ఇతరులకు కూడా) బోధించాడు. ఇక (మూడవ)ఉదాహరణ- (ధర్మాన్ని) కన్నెత్తి అయినా చూడకుండా దేవుడు నాకిచ్చిన సన్మార్గాన్ని తృణీకరించిన వానికి వర్తిస్తుంది." (బుఖారీ, ముస్లిం)

ప్రఖ్యాత తత్వవేత్త హసన్ బస్రి (రహ్మలై) విద్యను గురించి ఇలా వివరించారు: "విద్య రెండురకాలు. ఒకరకం విద్య అంతరంగంలోకి



దిగుతుంది. ఈ విద్యే ప్రళయదినాన పనికొస్తుంది. రెండోరకం విద్య నాలుకపైనే ఉండిపోతుంది; అంతరంగంలోకి దిగదు. ఈ విద్య దైవన్యాయస్థానంలో మనిషికి వ్యతిరేకంగా ప్రమాణం అవుతుంది. (అంటే మనిషికి వ్యతిరేకంగా సాక్ష్యం ఇస్తుందన్నమాట.)- (ముస్నద్‌దార్మి)

దైవప్రవక్త (స) హితోక్తి : "వారు ఖుర్‌ఆన్‌ని అధికంగానే పఠిస్తారు. కాని అది వారి కంఠాల నుండి క్రిందికి దిగదు. నాలుక మీదనే ఉండిపోతుంది. దాని జ్ఞానం, భావం వారి హృదయాల్లో లేశమైనా ఉండదు." (మిష్కాత్)

హజ్రత్ హసన్ బస్రీ (రహ్మలై) కథనం: "ఖుర్‌ఆన్ దేవుని ఆదేశం అని, ఆయన తరపు నుండే అవతరించిందని మన పూర్వీకులు దృఢంగా నమ్మేవారు. అంచేత వారు రాత్రివేళల్లో యోచన, పరిశీలనా దృష్టితో దాన్ని లోతుగా అధ్యయనం చేసేవారు; పగలు దాని ఆదేశాల ప్రకారం ఆచరించేవారు. కాని ఇప్పుడు మీపరిస్థితి చాలా శోచనీయం. మీరు ఖుర్‌ఆన్‌లోని పదాలను (చిలుక పలుకుల్లా పఠిస్తూ,) వాటి అక్షరాల కొమ్ములు, గుడింతాలు సరిచేయడమే ధ్యేయంగా పెట్టుకున్నారు. కాని ఆచరణ విషయంలో మీరు చాలా బద్ధకస్తులయి పోయారు." (కీమియాయె సాదత్)

దైవప్రవక్త (స) (తన అనుచరులకు హితోపదేశం చేస్తూ) "ఇనుముకు నీటివల్ల తుప్పు పట్టినట్లే హృదయానికి కూడా తుప్పు పట్టుతుంది" అని అన్నారు. (అనుచరులు) "అయితే హృదయానికి పట్టే తుప్పు ఎలా వదలుతుంది?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) సమాధానమిస్తూ "హృదయానికి పట్టిన తుప్పు పోవాలంటే మృత్యువును అత్యధికంగా జ్ఞాపకం చేసుకుంటూఉండాలి; దాంతోపాటు (తరచుగా) ఖుర్‌ఆన్‌ని పఠిస్తూఉండాలి" అని అన్నారు. (ఇబ్నెఉమర్-మిష్కాత్)

ఒక మనిషి సివిల్ లేదా మెకానికల్ ఇంజినీర్ కావాలంటే ఇంటర్మీడియట్ తరువాత నాలుగు సంవత్సరాలు చదవాలి. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలంటే ఆరేళ్ళు చదవాలి. మంచి డాక్టర్ కావాలంటే తొమ్మిది సంవత్సరాలు చదవాల్సిఉంటుంది. అలా ఇంజనీర్ లేదా డాక్టర్ కావడానికి

బడి(ప్రారంభం నుంచి కొన్ని వందల పుస్తకాలు చదవాల్సి ఉంటుంది. ఇంత కష్టపడి చదివితే ఉద్యోగం లభిస్తుందన్న గ్యారంటీ లేదు.

కాని మనిషి సదాచారిఅయిన ముస్లింగా జీవించడానికి కేవలం రెండు పుస్తకాలు చదివితే చాలు. అవే ఖుర్ఆన్, హదీస్ గ్రంథాలు. ఈ రెండు పుస్తకాలను రోజుకు రెండుగంటలు చొప్పున చదివినా రెండేళ్ళలో పూర్తి చేయొచ్చు. దానికి కావలసింది స్పృహ, శ్రద్ధ, పట్టుదలలు మాత్రమే.

దైవప్రవక్త (స) హితోక్తి : "నేను మీ దగ్గర రెండు వస్తువులు వదలిపెట్టి పోతున్నాను, ఈ రెండింటిని ధృఢంగా పట్టుకొని ఆచరించేవారు ఎన్నటికీ దారితప్పరు. వాటిలో ఒకటి, దైవగ్రంథం (అంటే ఖుర్ఆన్); రెండు, నా ప్రవచనాలు, సంప్రదాయాలు (అంటే హదీస్)." (మిష్కాత్)

## ఖుర్ఆన్ ఔన్నత్యం-4

"ఖుర్ఆన్ పఠనానికి మించిన గొప్ప ధ్యానం, సంస్మరణలు లేవు. అలాగే ఆధ్యాత్మిక వికాసం, నైతిక సంస్కరణల కోసం ఖుర్ఆన్ పఠనం కంటే గొప్ప సాధనం కూడా మరేమీ లేదు. అంతేకాదు, ఖుర్ఆన్ పఠనం కన్నా గొప్ప ఆరాధన కూడా ఏదీ లేదు. ఖుర్ఆన్ పఠనం సమక్షంలో ఎవరైనా ధ్యానం, సంస్మరణలకు (జికిర్‌కు) ప్రాధాన్యం ఇస్తున్నాడంటే అతనికి దైవధర్మం పట్ల సరైన అవగాహన లేదన్న మాట. ఖుర్ఆన్ పఠనం ద్వారానే దాసుడు అందరికంటే ఎక్కువ దైవసాన్నిధ్యం పొందగలుగుతాడని దైవప్రవక్త (స) అన్నారు." (కీమియాయె సాదత్)

దైవప్రవక్త (స) హితోక్తులు : "నా అనుచర సముదాయం కోసం అన్నిటి కంటే గొప్పఆరాధన ఖుర్ఆన్ పఠనమే." (కీమియాయె సాదత్)

"ఖుర్ఆన్ జ్ఞానంలేని హృదయం పాడుబడ్డ ఇంటితో సమానం." (తిర్మిజీ)

"దేవుడు ఈ (ఖుర్ఆన్) గ్రంథం ద్వారా ఎన్నో జాతులను ప్రగతి శిఖరాలకు చేరుస్తాడు; మరెన్నో జాతులను పతానాగాధంలోకి నెట్టి వేస్తాడు." (మిష్కాత్)



దైవప్రవక్త (స) హజ్రత్ అలి(రజి)తో మాట్లాడుతూ "జాగ్రత్త! త్వరలో ఓ పెద్దసంక్షోభం చెలరేగే కాలం రానున్నది" అన్నారు. అలి(రజి) ఈమాట విని "అయితే దైవప్రవక్తా! ఆ సంక్షోభం నుండి బయటపడే మార్గం ఏమిటీ?" అని అడిగారు. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా చెప్పారు :

"దైవగ్రంథం. (దైవగ్రంథం ద్వారానే మీరీ సంక్షోభం నుంచి బయట పడగలుగుతారు.) ఈ గ్రంథంలో మీకు పూర్వం ఉండిన జాతులపై ఏఏ పరిణామాలు సంభవించాయో అవన్నీ ఉన్నాయి. మీ తరువాత వచ్చే జాతులకు ఎలాంటి పరిణామాలు ఎదురవుతాయో కూడా ఇందులో ఉన్నాయి. మీ (దైనందిన) వ్యవహారాలను గురించి నిర్ణయాలు ఎలా తీసుకోవాలో అవి కూడా ఇందులో ఉన్నాయి.

"ఇది గంభీరమైన, నిర్ణయాత్మకమైన గ్రంథం. ఇది ఆషామాషీ గ్రంథం కాదు. ఎవరైనా దుర్మార్గుడు, చండశాసనుడు ఈ గ్రంథాన్ని వదిలేస్తే దేవుడు అతడ్ని అణగద్రొక్కుతాడు. మరెవరైనా దీన్ని వదిలేసి మరెక్కడ్నుంచైనా మార్గదర్శనానికి ప్రయత్నిస్తే దేవుడు అతడ్ని మార్గభ్రష్టుడిగా చేస్తాడు.

"ఈ ఖుర్ఆన్ దేవునికి చెందిన దృఢమైన త్రాడు. ఇది ఎంతో వివేకవంతమైన ఉపదేశం. ఇదే రుజుమార్గం. ఈ ఖుర్ఆన్‌లోని ఎలాంటి భావం కూడా మనిషిని తప్పుడు మార్గాల పైకి తీసుకు పోజాలదు. ఇందులో ఏ మానవ వాక్కుతోనయినా సరే కల్తీచేయడం సాధ్యంకాదు. పండితులు దీన్ని ఎంత పరిశోధించినా ఎన్నటికీ తృప్తి చెందలేరు. (పరిశోధించిన కొద్దీ మరికొన్ని కొత్తకోణాలు వెలుగుచూస్తూనే ఉంటాయి.) ఎంత చదివినా ఇది పాతపడిపోదు. దీని వింతలు, మహిమలు ఎన్నటికీ అంతంకావు. అందుకే జిన్నులు ఈగ్రంథం (సూక్తులు) విన్న తర్వాత 'మేము రుజుమార్గం చూపే ఓ విచిత్రమైన ఖుర్ఆన్ విన్నాం. అంచేత మేము దీన్ని విశ్వసించాం' అని అనకుండా ఉండలేకపోయారు.

"ఎవరు ఖుర్ఆన్ ప్రకారం మాట్లాడుతాడో అతను సత్యం మాట్లాడిన వాడవుతాడు. మరెవరు ఖుర్ఆన్ ప్రకారం నడుచుకుంటాడో అతను

తప్పకుండా తగిన ప్రతిఫలం పొందుతాడు. ఎవరు ఖుర్‌ఆన్ ప్రకారం నిర్ణయం తీసుకుంటాడో అతను న్యాయమైన నిర్ణయం తీసుకున్నవాడవుతాడు. మరెవరు దీన్ని అనుసరించమని ప్రజలకు పిలుపునిస్తాడో అతను వారికి రుజుమార్గం చూపినవాడవుతాడు." (తిర్మిజి)

1400 సంవత్సరాల క్రితం ప్రపంచ పరిస్థితి ఎలా ఉండిందో ఓసారి వెనక్కి తిరిగి చూడండి. ఆనాడు ప్రపంచమంతా భయంకర రుగ్మతలకు నెలవయిపోయింది. సమస్త మానవాళి వ్యాధిగ్రస్తమయ్యింది. ముదిరిన రోగాలతో మానవత్వం చిక్కిశల్యమై కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుండేది. దైవదాసుల హృదయాల్లో దుష్టశక్తులన్నీ తిష్ఠవేసి మానవతకు తూట్లు వేస్తుండేవి. బహుదైవారాధనా విషక్రిములు సర్వత్రావ్యాపించి స్వైరవిహారం చేయసాగాయి. హింసాదౌర్జన్యాల మశూచికం విలయతాండవమాడుతుండేది. అన్యాయం, అక్రమాల కలరా కార్చిచ్చులా అంటుకుపోయింది. అశ్లీలం, అసభ్యతల అంటువ్యాధి ఆకాశానికి ఎగబ్రాకింది. మత్తుపానీయాల మహమ్మారి మనస్సులను తుత్తునియలు చేస్తుండేది.

అలాంటి స్థితిలో అజ్ఞానం, అనైతికతలు అలుముకున్న ఆ నిరాశా నిశీధిలో అకస్మాత్తుగా ఓ ఆశాకిరణం మెరిసింది. అంధకారాన్ని పటాపంచలు చేస్తూ, పైశాచికతా జాడ్యాలను పారద్రోలేందుకు పుడమిపై ఓ సర్వరోగ నివారిణి అవతరించింది. ఆత్మ వికాసం కోసం పరితపించే అంతరాత్మను ఆదుకోవడానికి అరుదెంచిన రమజాన్ నెలలో దివి నుండి భువిపైకి ఓ దివ్యౌషధి అవతరించింది. అదే అంతిమ దైవవాణి- దివ్యఖుర్‌ఆన్.

ఈ మహోద్గ్రంథమే ఆనాడు కేవలం 23 సంవత్సరాల అతిస్వల్ప కాలంలో మానవాళి జీవితాన్ని సమూలంగా సంస్కరించి మానవత్వాన్ని తిరిగి అందలమెక్కించింది. ఈ దివ్యౌషధే సకల ఆధ్యాత్మిక, నైతిక, ఆర్థిక, సామాజిక రుగ్మతలను నిర్మూలించి నీతి, న్యాయం, సమత, సౌభ్రాతృత్వాలతో నిండిన ఓ అపూర్వ సత్సమాజాన్ని, ఓ అద్భుత సంక్షేమరాజ్యాన్ని నెలగొల్పింది. ఈ అమృత కలశమే వర్ణం, వర్గం, జాతి, తెగ, భాష, ప్రాంతం



మొదలైన వివక్షలన్నిటినీ అంతమొందించి మొత్తం మానవాళిని శాంతీ సామరస్యాలతో కూడిన వసుధైక కుటుంబంగా మార్చివేసింది.

నైతికంగా, ఆర్థికంగా, సామాజికంగా ఇంతటి మహత్తర విప్లవం రావడానికి కారణం ఆనాటి అరబ్బులు ఆ దివ్యగ్రంథాన్ని విశ్వసించి, అందులోని దైవాజ్ఞలను తు.చ. తప్పకుండా పాటించడమే.

అలాంటి గ్రంథం నేడు కేవలం పారాయణం, ప్రార్థనలకు పరిమితమై తన గతప్రాభవాన్ని కోల్పోయింది. ముస్లింలలో అత్యధికమంది ఈ గ్రంథాన్ని అప్పుడప్పుడు ఎంతో భక్తి శ్రద్ధలతో పఠిస్తూ పరవశించిపోవడమేగాని, అది వివిధ జీవనరంగాల్లో సూచించిన బోధనలకు అనుగుణంగా తమ నీతి నడవడికలను తీర్చిదిద్దుకునే ప్రయత్నం చేయడం లేదు. అందుకే వారు దాని శుభాలకు దూరమై అనేక సమస్యలతో సతమతమైపోతున్నారు.

ఐరోపా ఖండంతో సహా అనేకదేశాల్లో ప్రతిరోజూ ఎందరో ప్రజలు మానవ కల్పిత నియమాలతో, ఊహాజనిత సిద్ధాంతాలతో విసిగిపోయి ఖుర్‌ఆన్ వైపుకు మరలుతుంటే, ఆ మహాభాగ్యం కలిగివున్న ముస్లింలు హ్రస్వదృష్టితో దాన్ని పూజాపురస్కారాలకు పరిమితం చేయడం ఎంతో విచారకరం!

ఖుర్‌ఆన్ ఎంతటి మహోన్నతమైన ఉత్కృష్ఠ గ్రంథమో తెలుసుకోవడానికి కేవలం ఈ క్రింది సూక్తి ఒక్కటి చాలు:

"మేమీ ఖుర్‌ఆన్‌ని ఏదైనా పర్వతంపై దించితే, దాని పరిస్థితి ఏమవుతుందో నీవు చూస్తావు. అది దైవభీతితో కంపించి క్రుంగిపోతూ పగిలిపోతుంది. మానవులు (తమని గురించి) ఆలోచిస్తారని వారి ముందు మేమీ దృష్టాంతాలు పేర్కొంటున్నాం." (ఖుర్‌ఆన్-59:21)

దైవప్రవక్త (స) తరచుగా తన ప్రసంగాలలో ఇలా చెప్పేవారు: "అన్నిటికంటే అత్యంత శ్రేష్ఠమైన వాణి దేవునివాణి. అత్యంత శ్రేష్ఠమైన విధానం ముహమ్మద్ విధానం. అత్యంత దుష్టవిషయాలు 'బిద్‌అత్'లు. (దైవధర్మంలో చేర్చే కొత్తపోకడలు). ప్రతి బిద్‌అత్ మార్గవిహీనమైనది." (ముస్లిం)

జ్ఞానార్జనలో మొట్టమొదటిది, అతి ముఖ్యమైనది ఖుర్‌ఆన్ జ్ఞానార్జనే. ఖుర్‌ఆన్ తరువాత హదీస్ ఎంతో ముఖ్యమైనది. ఈ రెండిటి కలియక తోనే ఇస్లామీయ జ్ఞానం అవుతుంది. ఈరెండిటి జ్ఞానం ప్రతి ముస్లింకూ అవసరమే. కనుక దైవభీతిపరాయణులుగా జీవితం గడపదలచుకునేవారు ముందుగా ఖుర్‌ఆన్‌లో ఏముందో తెలుసుకోవాలి.

“విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించే సమయం ఇంకా రాలేదా? ఆయన పంపిన సత్యం ముందు లొంగిపోయేవేళ ఆసన్నంకాలేదా? గతంలో కొందరికి గ్రంథం ఇవ్వబడింది. కాని ఓ సుదీర్ఘకాలం గడచిన తర్వాత వారి హృదయాలు కఠినమయి పోయాయి. ఈనాడు వారిలో చాలా మంది దుర్మార్గులై ఉన్నారు. మీరలా కాకూడదు సుమా! వినండి! భూమి మృతప్రాయమైన తరువాత దేవుడు దానికి తిరిగి జీవం పోస్తున్నాడు. (అలాగే మృతప్రాయమైన మానవత్వానిక్కూడా ప్రవక్తల ద్వారా జీవం పోస్తున్నాడు.) మీరు విషయం గ్రహిస్తారని మా సూక్తులు మీకు విడమరచి చెబుతున్నాం.” (ఖుర్‌ఆన్-57:16,17)

## నమాజ్: సదాచరణకు తొలిమెట్టు-5

ధర్మానికి ఆధారం విశ్వాసం అయితే, విశ్వాసానికి దర్పణం ఆచరణ అవుతుంది. ఆచరణ ద్వారానే విశ్వాసం బహిర్గతమవుతుంది. దేవుణ్ణి, ఆయన ప్రవక్త (స)ను విశ్వసించామని చెప్పుకునే ముస్లింలు దేవుని ఆజ్ఞలను, ఆయన ప్రవక్త ప్రవచనాలను పాటిస్తున్నప్పుడే వారి విశ్వాసానికి గుర్తింపు లభిస్తుంది. ఇస్లాం సౌధానికి ఉండే అయిదు మూలస్తంభాలలో విశ్వాసం తర్వాత నమాజ్ అగ్రస్థానం వహిస్తుంది.

ఒక వ్యక్తి దేవుణ్ణి, దైవప్రవక్త (స)ను విశ్వసించానని ప్రకటించిన తర్వాత అతని విశ్వాస ప్రకటనకు ఎదురయ్యే మొట్టమొదటి పరీక్ష నమాజే. మస్జిద్ నుంచి అజాన్ పిలుపు వినగానే అతను తన విశ్వాస ప్రకటనను నిరూపించు కోవడానికి మస్జిద్‌కు పరుగెత్తి తోటిముస్లింలతో కలసి సామూహిక నమాజ్ చేయవలసి ఉంటుంది.



ఖుర్‌ఆన్‌లో ఒకచోట సృష్టికర్త ఇలా ఆదేశిస్తున్నాడు: “నిస్సందేహంగా నేనే దేవుణ్ణి. నేను తప్ప మరో ఆరాధ్యుడు లేడు. కాబట్టి (మానవుడా!) నీవు నన్నే ఆరాధించు. నా జ్ఞాపకార్థం నమాజ్‌ని స్థాపించు.” (20:14)

“విశ్వాసికి, అవిశ్వాసికి మధ్య వారిద్దరినీ వేరుచేసే హద్దు నమాజే” అని దైవప్రవక్త సెలవిచ్చారు. (ముస్లిం)

నమాజ్ మనిషిలో మంచిని పెంచి చెడులను పారద్రోలుతుంది. అతడ్ని జీవిత సమస్తరంగాల్లో నీతిమంతుడిగా, నిజాయితీపరుడిగా తీర్చిదిద్దుతుంది. ఖుర్‌ఆన్‌లో ఒకచోట “నమాజ్ తప్పనిసరిగా అశ్లీల చేష్టల నుండి, చెడు పనుల నుండి (మనిషిని) నిరోధిస్తుంది.” (29:45) అని పేర్కొన్నది.

“మనిషి చేసే నమాజ్ అతడ్ని అశ్లీల చేష్టల నుండి నిరోధించకపోతే అతని నమాజ్ నమాజే కానేరదు” అన్నారు దైవప్రవక్త (స).... (ముస్లిం)

ఇమాం జాఫర్ సాధిఖ్ (రహ్మాలై) ఇలా అన్నారు: “ఎవరైనా తన నమాజ్ దేవుని సన్నిధిలో స్వీకరించబడిందా లేదా అని తెలుసుకోదలిస్తే, తన నమాజ్ తనను అశ్లీలచేష్టల నుండి, చెడ్డపనుల నుండి ఏ మేరకు నిరోధించ గల్గిందో అతను చూసుకోవాలి. నమాజ్ నిరోధించే చెడులను గనక అతను మానుకు న్నట్లయితే అతని నమాజ్ స్వీకరించబడినట్లే.” (రూహుల్‌మాని)

నమాజ్ మనిషి విశ్వాసానికి గీటురాయి వంటిది. ఇస్లాం పట్ల మన విశ్వాసం ఏస్థాయిలో ఉంటుందో నమాజులో దేవునిపట్ల మన సంబంధం కూడా అదే స్థాయిలో ఉంటుంది. ముస్లింలు నిర్ణీత సమయాల్లో రోజుకు ఐదుసార్లు విధిగా నమాజుచేయాలి. ఇది విశ్వప్రభువు ఆజ్ఞ. దాన్ని పాటించని ముస్లిం పరమపాపి అయి నరక శిక్ష అనుభవించవలసి వస్తుంది.

కొందరు ముస్లింలు “అమ్మో, రోజుకు అయిదు సార్లే! మావల్ల కాదు బాబూ!” అంటారు. బద్ధకస్తులకు, ప్రాపంచిక ప్రయోజనాలే ధ్యేయంగా పెట్టుకున్నవారికి రోజుకు అయిదు సార్లేమిటీ, ఒక్క సారి నమాజ్ చేయడం కూడా కష్టమే. ఖుర్‌ఆన్ ఇలాంటి వారిని హెచ్చరిస్తూ ఈవిధంగా చెబుతోంది:

"నమాజ్ కాస్త కష్టమైన పనే. సందేహం లేదు. కాని ఒకరోజు తమ ప్రభువును కలుసుకోవలసి ఉందని, ఆయన సన్నిధికే మరలిపోవలసి ఉందని భావించే దైవభీతిపరులకు మాత్రం నమాజ్ చేయడం కష్టమేమీ కాదు." (ఖుర్ఆన్-2:45,46)

దేవునిపై, పరలోకంపై దృఢవిశ్వాసం ఉంటే, ఆ విశ్వాసం మనిషిని అప్రయత్నంగా ఆచరణ వైపుకు లాక్కెళుతుంది. ఏదో ఒక రోజు దైవానికి తన ముఖం చూపించవలసి ఉంటుందని, ఆయన సన్నిధిలో తన కర్మలకు సమాధానం ఇచ్చుకోవలసి ఉంటుందని అనుక్షణం అతని అంతరంగం అతనికి నొక్కి చెబుతుంది. అలాంటి వ్యక్తికి ప్రతిరోజు అయిదువేళలా నమాజ్ చేయడం ఏమాత్రం కష్టమైన పని కాజాలదు.

నమాజు కోసం దైవప్రవక్త (స) నిర్దేశించిన షరతులన్నిటిని వీలైనంత వరకు పూర్తిగా పాటించడానికి ప్రయత్నించాలి. మన ఆలోచనలను అటూ ఇటూ పోనీయకుండా ఏకాగ్రత్తతో నమాజ్ చేయాలి. నమాజ్‌లో మనం పఠించే ఖుర్ఆన్ సూక్తుల్ని జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలి. అరబీభాష రానివారు వేరే సమయాల్లో తమకు తెలిసిన భాషలో ఖుర్ఆన్ అనువాదాన్ని ప్రతిరోజూ కొంతసేపు అధ్యయనం చేయడానికి ప్రయత్నించాలి.

ఇస్లాం సామూహికత్వానికి ఎంతో ప్రాధాన్యత నిచ్చింది. సామూహిక నమాజ్ చేయడంవల్ల లభించే లాభం, దాన్ని విడనాడటంవల్ల జరిగే నష్టం గురించి దైవప్రవక్త (స) వివిధ సందర్భాలలో వివిధ కోణాల ద్వారా నొక్కి చెప్పారు. ఉదాహరణకు ఈ క్రింది హదీసులు చూడండి:

"ఒంటరిగా చేసే నమాజ్ కంటే సామూహికంగా చేసే నమాజ్ 27 రెట్లు శ్రేష్ఠమైనది" అని దైవప్రవక్త (స) తెలిపారు. (బుఖారి, ముస్లిం)

"సామూహిక నమాజ్‌కు లభించే పుణ్యఫలం గురించి ప్రజలకు తెలిసి వుంటే వారు ఏ స్థితిలో ఉన్నా సామూహిక నమాజ్ కోసం పరుగులు పెడ్తూ వస్తారు. జమాఅత్‌లోని మొదటి పంక్తి దైవదూతల పంక్తి వంటిది. ఒంటరిగా చేసే నమాజ్ కంటే ఇద్దరు వ్యక్తులతో కూడిన సామూహిక నమాజ్ ఎంతో



మెరుగైనది. నమాజ్ చేసేవారు ఎంతమంది ఎక్కువగా ఉంటే ఆ జమాఅత్ అంతే ఎక్కువ దేవునికి ప్రియమైనది." (జామె తిర్మిజి)

"అజాన్ విని కూడా ఇండ్ల నుంచి బయటికి రానివారిని చూస్తుంటే, నా స్థానంలో ఇమామత్ కోసం ఎవరినైనా నియమించి, నిప్పు తీసుకొని వెళ్ళి వారి ఇళ్ళను తగలబెట్టాలని అన్పిస్తుంది నాకు." (బుఖారి, ముస్లిం)

ఒకసారి ఒక అంధుడు వచ్చి "దైవప్రవక్తా! నేను అంధుణ్ణయినందున సామూహిక నమాజ్‌కు వెళ్ళలేకపోతున్నాను. మరి నాకు సామూహిక నమాజు లో పాల్గొనకుండా ఉండే అవకాశం ఏదైనా ఉందా?" అని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నీకు అజాన్ విన్పిస్తుందా?" అని అడిగారు. అతను వినిపిస్తుందన్నాడు. "అలాగైతే దానికి జవాబుగా నీవు మస్జిద్‌కు రావలసిందే. నీకు అనుమతిచ్చే అవకాశమేదీ లేదు" అని స్పష్టంగా చెప్పారు.

మరొకసారి ఆయన "ఎలాంటి అవరోధం లేకపోయినా సామూహిక నమాజ్ చేయడానికి రాని మనిషి ఒంటరిగా చేస్తే ఆ నమాజ్ స్వీకరించ బడదు" అన్నారు. అనుచరులు ఈమాట విని "అవరోధం అంటే ఏమిటీ?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "అవరోధమంటే భయం లేదా ఎదైనా వ్యాధి" అన్నారు. (అబూదావూద్)

ఖుర్ఆన్ విశ్వాసుల గుణగణాలను వర్ణిస్తూ వారి ప్రార్థనా పరిస్థితి గురించి ఇలా పేర్కొన్నది:

①-వారు ప్రార్థనా (నమాజు) వ్యవస్థ నెలకొల్పుతారు. (42:38)

②-వారు తమ నమాజులో ఎంతో అణుకువ, నమ్రతలు పాటిస్తారు. (23:2)

③-వారు తమ నమాజులను క్రమం తప్పకుండా, నియమబద్ధంగా పాటిస్తారు. (23:9)

④-వారు పాపక్షమాపణ కోసం మాటిమాటికి దేవుని వైపు మరలుతారు. ఆయన్నే ఆరాధిస్తారు. ఆయన స్తుతిగానాలు చేస్తారు. (9:112)

⑤–వారు రాత్రిళ్ళు మేల్కొని దైవారాధనలో గడుపుతారు. ఆశతో, భయంతో తమ ప్రభువును వేడుకుంటారు. (32:15)

⑥–వారు రాత్రివేళల్లో చాలా తక్కువగా నిద్రించేవారు. ప్రతిరోజూ తెల్లవారు జామున లేచి (తమ ప్రభువును) క్షమాపణ కోరుకునేవారు. (51:17,18)

⑦–వారిలా ప్రార్థిస్తారు: "ప్రభూ! మేము (నిన్ను, నీప్రవక్తను) విశ్వసించాం. మాతప్పులు మన్నించు. మమ్మల్ని నరకాగ్నినుండి రక్షించు." (3:16)

⑧–దేవుడు ఏ ఆలయాలను ఉద్ధరించి, అక్కడ తనపేరు స్మరిస్తుండాలని ఆదేశించాడో ఆ ఆలయాలలోనే (ఆయన చూపిన సన్మార్గం పొందేవారు) ఉంటారు. వారా ఆలయాలలో ఉదయం, సాయంత్రం ధ్యానంచేస్తూ ఎంతో నిష్ఠాగరిష్ఠులై ఉంటారు. దైవస్మరణ, నమాజ్‌స్థాపన, జకాత్ చెల్లింపు (వగైరా) విధుల నిర్వహణ నుండి (ఐహిక వ్యామోహం,) వ్యాపార వ్యవహారాలు వారిని ఎన్నటికీ విస్మరింపజేయలేవు. (24:36,37)

⑨–వారు నిల్చొని, కూర్చొని, పడుకొని ఏస్థితిలో ఉన్నాసరే ఎల్లప్పుడూ దేవుడ్ని స్మరిస్తుంటారు. అదీగాక వారు భూమ్యాకాశాల నిర్మాణం గురించి పరిశీలిస్తూ ఇలా ప్రార్థిస్తారు: "ప్రభూ! నీవు ఈ విశ్వాన్ని నిష్ప్రయోజనంగా, లక్ష్యరహితంగా సృజించలేదు. నీవు పరమ పవిత్రుడవు. మమ్మల్ని నరక యాతనల నుండి కాపాడు...." (3:190,191)

⑩–నీవు ఎప్పుడైనా వారిని చూస్తే వారు రుకూ, సజ్దాలు చేయడంలో, దేవుని అనుగ్రహం, ఆయన ప్రసన్నతలు అర్థించడంలో నిమగ్నులై ఉండటం కన్పిస్తుంది. వారి ముఖాలపై సాష్టాంగప్రణామ చిహ్నాలుంటాయి. ఆ చిహ్నాల్ని బట్టే వారిని గుర్తించవచ్చు. (48:29)

## దైవమార్గంలో ధనవినియోగం-6

ఇస్లాంలో నమాజ్, ఉపవాసాలకు ఎంత విలువ, ప్రాముఖ్యతలు ఉన్నాయో దానధర్మాలకు, ఇతరసత్కార్యాల కోసం ధనవినియోగానికి కూడా అంతే విలువ, ప్రాముఖ్యతలు ఉన్నాయి. ధనత్యాగం లేని



ఆరాధనలకు ఇస్లాంలో ఏమాత్రం విలువ లేదు. నమాజ్, ఉపవాసాలు, దైవనామస్మరణలు "శారీరక ఆరాధనలు" అనబడతాయి. జకాత్, సదఖా, ఫిత్రా, ఫిదియాలను "ధనసంబంధమైన ఆరాధనలు" అంటారు. బండి చక్రాల్లాంటి ఈ రెండు విధాల ఆరాధనలలో ఏ ఒక్కటి లేకపోయినా "ఆరాధనా శకటం" ఒక్క అంగుళం కూడా ముందుకు సాగదు.

దైవం నిర్దేశించిన శారీరక ఆరాధనలు వదలి ఉన్నదంతా దానధర్మాలకు వెచ్చిస్తే ప్రపంచంలో మనిషి దానకర్ణుడిగా, హాతింతైగా ఖ్యాతి పొందగల్గుతాడుకాని, దైవప్రసన్నత మాత్రం పొందలేడు. అలాగే ప్రపంచ వ్యవహారాలు వదలి ఏకాంతకుహురాల్లో కూర్చొని జీవితాంతం కఠోర తపస్సు చేసినా పరలోక మోక్షం పొందలేడు. సత్కార్యాలకోసం ధనం ఖర్చుపెట్టనివాడు తననుతాను సర్వనాశనం చేసుకున్నట్లేనని ఖుర్‌ఆన్ హెచ్చరిస్తోంది. (2:195)

ఒక వ్యక్తిలోని ధనవ్యామోహం అతనికేగాక, ఇతరులక్కూడా అనేక అనర్థాలు తెచ్చిపెడ్తుంది. ఒక్కొక్కసారి మనిషి ఎన్ని అడ్డదారులు తొక్కి ప్రయత్నించినా అతనికి రెండుపూటలు తిండి కూడా సరిగా దొరకదు. మనిషి తనదని చెప్పుకునే ధనమంతా నిజానికి అతనిది కాదు. దాన ధర్మాలు చేయడం ద్వారా, ధర్మసంస్థాపనా కృషికి వినియోగించడం ద్వారా పరలోకానికి పంపుకునే ధనం మాత్రమే అతనిది అవుతుంది.

మహాప్రవక్త (స) మహితోక్తి : "మనిషి నా ధనం, నా డబ్బు అంటాడు. నిజానికి నీ ధనంలో నీవు తిని అంతం చేసింది, నీవు ధరించి మాసిపోయేలా చేసింది లేదా నీవు దానధర్మాలు చేసి ముందుకు పంపుకున్నది మాత్రమే నీ వాటాకు వస్తుంది. మిగిలినదంతా చేజారిపోయేదే. నీవు దాన్ని ఇతరుల కోసం వదలి వెళ్ళవలసి ఉంటుంది." (ముస్లిం)

అదీ బిన్ హాతిం(రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "అతిత్వరలో దేవుడు ప్రళయదినాన మీలోని ప్రతి మనిషితో ప్రత్యక్షంగా మాట్లాడుతాడు. ఆరోజు దేవునికి, దాసునికి మధ్య ఎలాంటి అనువాదకుడు ఉండడు. దాసుడు తలపెకెత్తి చూస్తాడు. మొదట తన ముందు ఏదీ

కన్పించదు. రెండవ సారి మళ్ళీ తల పెకెత్తి చూస్తాడు. అప్పుడతని ముందు ఎటు చూసినా అతనికి స్వాగతం చెబుతూ (భగభగ మండే) అగ్ని కన్పిస్తుంది. అందువల్ల మీలో ఎవరైనా ఓ ఖర్జూరపు ముక్కయినా సరే దానం చేసి నరకం నుండి కాపాడుకోగలిగితే కాపాడుకోండి.'' (మిష్కాత్)

హజ్రత్ అబూజర్ గిఫ్ఫారి (రజి) కథనం:- నేనొక రోజు సాయంత్రం దైవప్రవక్త (స) వెంట మదీనాపట్నం వెలుపల కంకర నేలపై నడచి వెళ్తుంటే మా ఎదురుగా ఉహద్ పర్వతం వచ్చింది. అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "అబూజర్! నా దగ్గర ఉహద్ పర్వతమంత బంగారం ఉండి, ఒకరాత్రి లేక మూడు రాత్రులు గడిచినంత కాలంలో అప్పు తీర్చ డానికి ఉంచుకునే దీనార్ తప్ప ఆ బంగారంలో ఒక దీనార్ కూడా నా దగ్గర ఉండిపోవడం నాకిష్టం లేదు. నేనా సంపదను దైవదాసుల కోసం ఇలా అలా ఖర్చు పెడతాను.'' దైవప్రవక్త (స) ఈమాట అంటూ తన చేతిని అటూ ఇటూ తిప్పి చూపారు. (బుఖారి)

దైవప్రవక్త (స) ఉపదేశించిన కొన్ని హితోక్తులు ఇక్కడ చూడండి :

"నీవొక శత్రువుని చంపి విజయం సాధించాననో లేక అతను నిన్ను చంపడం వల్ల నీకు స్వర్గప్రాప్తి కలుగుతుందనో అనుకుంటావు. కాని నీ అసలు శత్రువు అతను కాదు. నీ అసలుశత్రువు నీ కడుపున పుట్టిన పిల్లవాడు కావచ్చు. అంతకంటే పెద్ద శత్రువు నీ అధీనంలో ఉన్న నీ సిరిసంపదలే'. (తబ్రాని)

"ఆదం కుమారుడు రెండు విషయాలను అసహ్యించుకుంటాడు. ఒకటి, మృత్యువుని. కాని విశ్వాసికి మృత్యువు కల్లోలం, సంక్షోభాల కన్నా శ్రేష్ఠమైనది. రెండు, ధనం కొరతను. కాని స్వల్ప ధనం వల్ల (పరలోకంలో కర్మల) లెక్క కూడా తక్కువగా ఉంటుంది.'' (ముస్నద్ అహ్మద్)

"ఎవరైతే కొంచెం ఉపాధి (ప్రాపంచిక సామగ్రి)తో దేవుని పట్ల సంతృప్తి చెందుతాడో దేవుడు అతను చేసుకున్న కొంచెం సత్కర్మల పట్ల సంతృప్తి చెందుతాడు.'' (బైహఖి)



"పేదవాడు ధనికుడికంటే ఐదు వందల సంవత్సరాలకు ముందే స్వర్గం లో ప్రవేశిస్తాడు. ఇది (దేవుని దృష్టిలో) సగం దినంతో సమానం.'' (తిర్మిజి)

"ప్రతిరోజూ ఉదయం ప్రజలు నిద్ర నుండి మేల్కొనగానే ఇద్దరు దైవదూతలు దిగుతారు. వారిలో ఒకడు దైవాన్ని ప్రార్థిస్తూ 'దేవా! (దానం) ఇచ్చేవాడికి మరింత (పుణ్యఫలం) ఇవ్వు' అనంటాడు. రెండో దూత 'దేవా! పిసినారి సంపదను నాశనంచెయ్యి' అని ప్రార్థిస్తాడు.'' (బుఖారి)

"(దైవమార్గంలో) ఖర్చుపెట్టు. లెక్కపెట్టకు. లెక్కపెట్టి ఇస్తే దేవుడు కూడా నీకు లెక్కపెట్టి మరీ ఇస్తాడు. (అంటే నీపట్ల ఉదారంగా వ్యవహ రించడు.) అలాగే కూడబెట్టి ఉంచకు. కూడబెడ్తే దేవుడు కూడా (నీకు పుణ్యఫలం ప్రసాదించకుండా) ఆపిఉంచుతాడు.'' (బుఖారి)

దైవప్రవక్త (స) ఓసారి తన అనుచరులతో మాట్లాడుతూ "ప్రతి ముస్లిం విధిగా దానం చేయాలి" అన్నారు. అనుచరులు ఈమాట విని "మరి ఎవరి దగ్గరైనా దానం చేయడానికి ఏమీ లేకపోతే ఎలా?" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "అప్పుడా వ్యక్తి కష్టపడి సంపాదించి తానూ అనుభవించాలి, దాన్ని దానం కూడా చేయాలి" అన్నారు.

"ఒకవేళ అలా చేసే శక్తి కూడా లేకపోతే లేదా అలా కూడా చేయక పోతే?" మళ్ళీ అడిగారు అనుచరులు. "అప్పుడు ఎవరైనా అగత్యపరుడు ఏదైనా ఆపదలో చిక్కుకుంటే అతడ్ని ఆదుకోవాలి" అన్నారు దైవప్రవక్త (స). అనుచరులు మళ్ళీ "అది కూడా చేయకలేక పోతేనో?" అనడిగారు. దానికి దైవప్రవక్త (స) "(అదీ చేయలేకపోతే) మేలు చేయాలని లేక సత్కార్యాలు చేయాలని ఇతరులకు సలహాలివ్వాలి" అని చెప్పారు. "అదీ చేయలేకపోతే...?" అని మళ్ళీ అడిగారు అనుచరులు. అప్పుడు దైవప్రవక్త (స) "(అలాంటి పరిస్థితిలో కనీసం) తాను చెడ్డపనులు చేయకుండా, ఇతరులకు చెడు తలపెట్టకుండా ఉండాలి. ఇది కూడా దానం (సదఖా) కిందికే వస్తుంది" అని సమాధానమిచ్చారు. (బుఖారి, ముస్లిం)

మనిషి దేవుడు నిర్దేశించిన రుజుమార్గం వదలి అపమార్గం పట్టిపోతే షైతాన్ అతడ్ని రకరకాల భయప్రలోభాలకు గురిచేసి తప్పుడు పనులకు పాల్పడేలాచేస్తాడు. ఆర్థికవ్యవహారాల్లో షైతాన్ మనిషిని పేదరికం గురించి భయపెడతాడు. దాంతో అతను పేదలకు సహాయంచేయడంలో, ఇతర సత్కార్యాల కోసం డబ్బు ఖర్చుపెట్టడంలో పిసినారితనం వహిస్తాడు.

"షైతాన్ మిమ్మల్ని పేదరికం గురించి భయపెట్టి సిగ్గుమాలిన పనులకు పాల్పడేలా ప్రేరేపిస్తాడు. కాని దేవుడు మిమ్మల్ని క్షమిస్తానని, అనుగ్రహిస్తానని వాగ్దానం చేస్తున్నాడు." (ఖుర్‌ఆన్-2:268)

"దేవుడు తన అనుగ్రహంతో ప్రసాదించిన సంపద విషయంలో పిసినారి తనం వహించేవారు ఆ పిసినారితనం తమకు మేలు చేస్తుందని భావించ కూడదు. అది వారికి హాని కలిగిస్తుంది. వారు ఏధనం విషయంలో పిసినారి తనం వహిస్తున్నారో అది రేపు ప్రళయదినాన వారి మెడకు గుదిబండగా మారుతుంది." (ఖుర్‌ఆన్-3:180)

"విశ్వాసులారా! మీ సంతానం, సిరిసంపదలు మిమ్మల్ని దైవధ్యానం నుండి మరపింపజేయకూడదు. అలా చేసేవారే నష్టపోయేవారు. మేము ప్రసాదించిన ఉపాధి నుండి (మామార్గంలో) ఖర్చుపెట్టండి. మీలో ఎవరి కైనా మరణసమయం ఆసన్నమయి "ప్రభూ! నాకు మరికొంత గడువియ్య లేదే? ఇస్తే నేను దానధర్మాలు చేసి సజ్జనుల్లో చేరిపోతాను కదా?" అని అతను అనవచ్చు. అలాంటి దుస్థితి దాపురించక ముందే ఈ సత్కార్యం చేయండి. ఎవరికైనా ఆచరణ గడువు ముగిసే సమయం వస్తే, ఇక అతనికి దేవుడు ఏమాత్రం అవకాశం ఇవ్వడు." (ఖుర్‌ఆన్-63:9-11)

"వారికిలా చెప్పు: 'నా ప్రభువు తన దాసులలో తానుకోరిన విధంగా కొందరికి విస్తృతంగా, మరికొందరికి స్వల్పంగా ఉపాధి ప్రసాదిస్తున్నాడు. మీరు (దైవమార్గంలో) ఏది ఖర్చుపెట్టినా ఆ వెల్తిని భర్తీచేయడానికి ఆయన మీకు మరింత ప్రసాదిస్తాడు. ఆయన యావత్తు ఉపాధి ప్రదాతల్లోకెల్లా గొప్ప ఉపాధిప్రదాత." (ఖుర్‌ఆన్-34:39)



❶-విజ్ఞులైన విశ్వాసులు మేము ప్రసాదించిన ఉపాధి నుండి రహస్యం గాను, బహిరంగంగాను ఖర్చుపెడతారు. (ఖుర్‌ఆన్-13:22)

❷-దైవస్మరణ, నమాజుస్థాపన, జకాత్ చెల్లింపు (వగైరా) విధుల నిర్వహణ నుండి (ఐహికవ్యామోహం,) వ్యాపారవ్యవహారాలు వారిని ఎన్నటికీ విస్మరింపజేయలేవు. (ఖుర్‌ఆన్-24:37)

❸-(వారు అన్నార్తులతో అంటారు:) "మేము దేవునికోసం అన్నదానం చేస్తున్నాం. మీనుండి ప్రతిఫలంగాని, కృతజ్ఞతలుగాని ఆశించడం లేదు. మేమసలు ఘోరమైన ఆపద తెచ్చిపెట్టే సుదీర్ఘదినం గురించి దేవునికి భయపడుతున్నాం." (76:7-10)

❹-వారు తమప్రభువు మీదే భారం వేస్తారు...మేము ప్రసాదించిన సంపద నుండి (దైవమార్గంలోనూ) ఖర్చుపెడతారు. అలాంటివారే మా దృష్టిలో నిజమైన విశ్వాసులు. (ఖుర్‌ఆన్-8:3,42:38,22:35)

❺-వారి సంపదలో అర్థించేవారికి, అర్థించనివారికి ఒక నిర్ణీత భాగం ఉంటుంది. (ఖుర్‌ఆన్-70:20,51:19)

❻-వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపదను (దైవమార్గంలో) ఖర్చుపెడతారు. (ఖుర్‌ఆన్-3:134)

❼-తాము ఖర్చుపెట్టే ధనంవల్ల దైవసాన్నిధ్యం లభిస్తుందని, తమ శ్రేయస్సు కోసం దైవప్రవక్త ప్రార్థన చేస్తాడని భావిస్తున్నారు. నిజమే, అది వారికోసం తప్పక (దైవ)సాన్నిధ్యానికి కారణమవుతుంది. దేవుడు తప్పకుండా వారిని తన కారుణ్యఛాయలోకి తీసుకుంటాడు. (ఖుర్‌ఆన్-9:99)

❽-వారు తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా ఖర్చుచేయరు; ఇటు పిసినారితనం కూడా వహించరు. వారి ఖర్చు ఆ రెండు అతిచర్య లకు మధ్యస్తంగా ఉంటుంది. (ఖుర్‌ఆన్-25:67)

❾-వారు తమ సంపద నుండి (పేదల ఆర్థిక హక్కు) జకాత్ చెల్లిస్తారు. (ఖుర్‌ఆన్-23:4)

⑩–దైవమార్గంలో సంపద ఖర్చుచేసేవారి (ఖర్చు) పోలిక, ఒక విత్తనం నాటగా అది ఏడు వెన్నులు ఈని ప్రతి వెన్నులో వందేసి గింజలున్నట్లు ఉంటుంది. అదేవిధంగా దేవుడు తాను తలచుకున్న వారి కర్మఫలాన్ని అనేక రెట్లు పెంచుతాడు. (ఖుర్ఆన్–2:261)

## ధనత్యాగం–7

త్యాగభావంలేని ధర్మపరాయణత ధర్మపరాయణత అన్పించుకోదు. ఆ త్యాగల్లో కూడా ప్రాణత్యాగం తర్వాత ధనత్యాగం ఎంతో గొప్పవిషయం. ఈ వాస్తవాన్ని గురించి ఖుర్ఆన్‌లోని ఈ క్రింది సూక్తులు చూడండి:

భూమ్యాకాశాలన్నీ దేవునివే అయినప్పుడు, ఆ దేవుడు ప్రసాదించిన ధన కనక వస్తువుల్ని ఆయన మార్గంలో ఖర్చు చేయడానికి మానవులకు ఎలాంటి అభ్యంతరం ఉండకూడదు. కాని మానవుడు పిసినారితనం వల్ల సత్కార్యాల కోసం డబ్బు వెచ్చించడానికి వెనుకంజ వేస్తాడు. అంచేత ఉపాధి ప్రసాదించేది తానేనని, మీరేదైనా దానంచేస్తే ఆ కొరత తాను తీరుస్తానని దేవుడు అంటున్నాడు (34:39). అంతేకాదు, నేను ప్రసాదించిన ఆ ధనాన్ని నాకు రుణంగా ఇస్తే ఆ రుణాన్ని నేను అనేక రెట్లు పెంచి తిరిగి తీర్చుతానని ఆయన వాగ్దానం చేస్తున్నాడు. (57:11)

అబుద్దహ్దా అన్సారీ (రజి) ఈసూక్తి విని "దైవప్రవక్తా! దేవుడు మనల్ని అప్పు అడుగుతున్నాడా?" అని ప్రశ్నించారు. దానికాయన అవునన్నారు. అప్పుడు అబుద్దహ్దా (రజి) "అయితే మీచేయి జాపండి"అన్నారు. దైవప్రవక్త (స) చేయిజాపారు. అబుద్దహ్దా(రజి) ఆయన చేతిని తన చేతిలోకి తీసుకొని "నేను నాప్రభువుకు నాతోట (అప్పుగా) ఇస్తున్నాను" అని చెప్పారు.

అబుద్దహ్దా (రజి) తోటలో ఆరొందల ఖర్జూర చెట్లున్నాయి. తోటలోనే ఆయన ఇల్లుంది. అక్కడే ఆయన భార్యాపిల్లలు నివసిస్తున్నారు. ఈమాట చెప్పి ఆయన నేరుగా తోట దగ్గరికెళ్ళి "ఉమ్మెదహ్దా! బయటికి వచ్చేసెయి. నేనీ తోటను నా ప్రభువుకు అప్పుగా ఇచ్చేశాను" అన్నారు. ఆయన భార్య



కూడా ఎంతో సాధ్వీమణి. ఆమె ఈమాట విని "మీరు చాలా లాభదాయకమైన వ్యాపారమే చేశారు" అన్నారు. అప్పటికప్పుడు ఆయన తన ఇంటి సామగ్రిని, భార్యాపిల్లలను తీసుకొని తోటలో నుంచి బయటికి వచ్చేశారు.

రోమన్లు మదీనాపై దాడిచెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నారని సమాచారం అందడంతో దైవప్రవక్త ముహమ్మద్ (స) వారిని ఎదుర్కోవడానికి 'తబూక్' దండయాత్రకు సన్నాహాలు చేయవలసివచ్చింది. సిరియా సరిహద్దున గల తబూక్ ప్రాంతానికి ముస్లింయోధులు సుదీర్ఘ ప్రయాణం చేయవలసి ఉండింది. పైగా అది తీవ్రమైన ఎండాకాలం. పకడ్బందీగా భారీఎత్తు సన్నాహాలు చేయడానికి అత్యధిక ఆయుధాలు, ఆహార పదార్థాలు, వాహనాలను సమీకరించవలసి వచ్చింది. అంచేత దైవప్రవక్త (స) ధన, కనక, వస్తు త్యాగాల కోసం ప్రజలను ప్రేరేపించారు.

దైవప్రవక్త (స) బోధతో ఉత్తేజితులయిన ప్రజలు విశాలహృదయంతో భూరి విరాళాలు అందజెయ్యడం ప్రారంభించారు. కొందరు ధర్మసంస్థాపనా మార్గంలో తమ సర్వస్వం త్యాగం చెయ్యాలన్న వీరావేశంతో తమ శక్తికి మించిన విరాళాలు కూడా ఇచ్చారు. హజ్రత్ ఉస్మాన్ (రజి) వేయి దీనార్‌ల విలువగల వస్తువుల్ని దైవప్రవక్త (స)కు అందజేశారు. ఆయన ధనికులైనప్పటికీ ఈ విరాళం ఆ కాలంలో అత్యధికమైనదే.

ఉమర్ (రజి) ధనత్యాగంలో అబూబకర్ (రజి)ని మించిపోవాలనుకొని తన మొత్తం ఆస్తిలో అర్ధభాగం తెచ్చారు. దైవప్రవక్త (స) అది చూసి "భార్యాపిల్లల కోసం ఏమైనా మిగిల్చిపెట్టావా లేదా?" అని అడిగారు. దానికి హజ్రత్ ఉమర్ (రజి) "వాళ్ళ కోసం సగం వదలి పెట్టాను" అన్నారు.

ఆ తర్వాత అబూబకర్ (రజి) ఇంట్లో ఉన్నదంతా ఊడ్చి తెచ్చి దైవప్రవక్త (స) పాదాల చెంత పోశారు. ఈ అసాధారణ దాతృత్వం చూసి ఆయన ఆశ్చర్యపోయారు. "అబూబకర్! ఉన్నదంతా తెచ్చినట్లుంది. మరి ఇంట్లో భార్యాపిల్లల కోసం ఏం వదలిపెట్టావు?" అనడిగారు ఆయన. "భార్యాపిల్లల కోసం దేవుడు, దైవప్రవక్త చాలు" అన్నారు అబూబకర్ (రజి).

ఇది భాగ్యవంతుల పరిస్థితి. మరి మధ్యతరగతి ప్రజల పరిస్థితి ఏమిటీ? వాళ్ళు కూడా ఈ మహాకార్యం కోసం శక్తివంచన లేకుండా తమకున్న దాంట్లోనే అత్యధికంగా విరాళాలు అందజేశారు. పేదవాళ్ళు కూడా తమ సంపాదనలో అంతో ఇంతో తెచ్చి విరాళాల గుట్టలో పెట్టేశారు.

పాపం అబూఖలీల్ (రజి) దగ్గర విరాళం ఇవ్వడానికి ఏమీ లేదు. ఆయన కూలినాలి చేసి బ్రతికే నిరుపేద శ్రమజీవి. ఒక్కోరోజు ఆ కూలిపని కూడా దొరికేదికాదు. అప్పుడాయన కుటుంబం పస్తులుండవలసి వచ్చేది.

అయితే దైవప్రవక్త (స) ప్రకటన వినగానే అబూఖలీల్ (రజి) ఓ తోట యజమాని దగ్గరికెళ్ళి చెట్లకు నీళ్ళు తోడిపోస్తానని చెబితే అతను ఒప్పు కున్నాడు. ఆరోజు అబూఖలీల్ (రజి) ఇషానమాజ్ తర్వాత తోటకెళ్ళి రాత్రి తెల్లవారేదాకా బావి నుంచి నీళ్ళు తోడారు. ఇంత కష్టపడితే తోటయజమాని కూలి క్రింద ఆయనకు నాలుగు సేర్ల ఖర్జూర పండ్లు ఇచ్చాడు. అబూఖలీల్ (రజి) వాటిని తీసుకొని సంతోషంగా ఇంటికి వచ్చారు.

ఆ ఖర్జూరపండ్లలో సగం భార్యాపిల్లల కోసం వదలిపెట్టి మిగతా సగం మూటకట్టుకొని దైవప్రవక్త(స) సన్నిధికి వెళ్ళారు ఆయన. కాని జనం పెద్దపెద్ద విరాళాలు ఇస్తుంటే తాను ఈ చిన్నవిరాళం ఇవ్వాల్సి వస్తున్నదే అని భావించి సిగ్గుపడ్డారు. అంచేత ఆయన అటూఇటూ చూసి ఆ పండ్ల మూటను విరాళాలకుప్పలో అడుగుభాగాన పెట్టేశారు. దైవప్రవక్త (స) అది గమనించి ఆ మూటను అక్కడ్నుంచి తీసి విరాళాలకుప్ప పైభాగాన పెట్టేశారు. అబూఖలీల్ (రజి) అది చూసి ఎంతో సంతోషించారు.

హజ్రత్ అబూతల్హా (రజి) మదీనాలోని అన్సార్ ముస్లింలలో కెల్లా గొప్ప ధనికులు. ఆయనకు (అనేక) ఖర్జూరపు తోటలు ఉండేవి. వాటిలో 'బైర్హా' తోటంటే ఆయనకు ఎంతో ఇష్టం. ఈ తోట మస్జిదె నబవీ ముందు భాగాన ఉండేది. దైవప్రవక్త (స) ఆ తోటలోకి తరచుగా వెళ్తూ అక్కడి మంచినీళ్ళు త్రాగేవారు. ఖుర్ఆన్‌లో "మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని



దైవమార్గంలో ఖర్చు చేయనంత వరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు" అనే సూక్తి (3:92) అవతరించినపుడు అబూతల్హా (రజి) లేచి ఇలా అన్నారు:

"దైవప్రవక్తా! 'మీకు అత్యంత ప్రీతికరమైన వస్తువుని దైవమార్గంలో ఖర్చు పెట్టనంతవరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేర'ని దేవుడు సెలవిస్తు న్నాడు కదా! 'బైర్హా' తోట నాకెంతో ఇష్టమైనది. అంచేత నేనా తోటను దైవమార్గంలో దానం చేస్తున్నాను. దైవం నుండి దాని పుణ్యఫలం ఆశిస్తున్నా. పరలోకంలో అది నాకోసం గొప్ప నిక్షేపంగా తయారవుతుందని నమ్ముతున్నాను. దైవప్రవక్తా! మీరు దైవాజ్ఞ ప్రకారం దాన్ని ఉపయోగించండి."

అప్పుడు దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "చాలా మంచిది. ఇదెంతో లాభదాయకమైన సంపద. నిజంగా ఇదెంతో లాభదాయకమైన సంపద. నీ మాటలు నేను విన్నాను. అయితే నాదొక సలహా. ఆ తోటను నీ (పేద) బంధువులకు పంచిపెట్టు." అబూతల్హా (రజి) ఈమాట విని "నేను మీఆజ్ఞ శిరసావహిస్తున్నాను" అన్నారు. తర్వాత ఆయన ఆ తోటను తన పెదనాన్న, చిన్నాన్న కొడుకులకు, ఇతర బంధువులకు పంచివేశారు. (బుఖారి)

దైవప్రవక్త (స) కష్టార్జితం ఔన్నత్యం గురించి ప్రస్తావిస్తూ "తన చేతులతో కష్టపడి సంపాదించిన ఉపాధి కంటే శ్రేష్ఠమైన ఉపాధి తిన్న వారెవరూ లేరు. దైవప్రవక్త దావూద్ తన చేతులతో పనిచేసి ఉపాధి సంపాదించేవారు" అని అన్నారు. (బుఖారి)

ఎక్కువ సంపాదించాలన్న యావతో అక్రమ పద్ధతులకు పాల్పడ కుండా కొద్దిగానైనా కష్టపడి సంపాదించి తినడం ఎంతో మేలని ఈ హదీస్ తెలుపుతోంది. మన దేశం పాలించిన చక్రవర్తుల్లో నాసిరుద్దీన్ మహ్మూద్, ఔరంగజేబ్ (రహ్మ)లు ప్రభుత్వ ధనాగారాల్లోని ఒక్క పైసా కూడా ముట్టు కోకుండా కష్టపడి పనిచేసి తమ కుటుంబాలను పోషించుకునేవారు.

దైవప్రవక్త (స) ప్రియ అనుచరుడు అబూబకర్ (రజి) బట్టలు అమ్మి కుటుంబాన్ని పోషించేవారు. దైవప్రవక్త (స) తదనంతరం ఆయన తొలి

శ్రేష్ఠఖలీఫాగా ఎన్నికయ్యారు. అయితే ఖలీఫా అయిన మరుసటి రోజే ఆయర బట్టలమూట భుజాన వేసుకొని అమ్ముకోవడానికి బయలుదేరారు. దారిలో ఉమర్ (రజి) ఎదురయి "ఏమిటి మీరు చేస్తున్న ఈ పని? ఈ బట్టల మూటేమిటీ?" అని అడిగారు. దానికి అబూబకర్ (రజి) "ఈ పని చేయకపోతే భార్యాపిల్లలను పోషించేదెలా?" అన్నారు.

ఉమర్ (రజి) ఈమాట విని "ఇప్పుడు మీపై ముస్లింల నాయకత్వపు (పరిపాలనా)బాధ్యత వచ్చిపడింది. ఆ బాధ్యతతో పాటు ఈపని పొసగదు. పదండి, (ప్రభుత్వకోశాధికారి) అబూఉబైదా (రజి)ను కలసి మాట్లాడుదాం పదండి" అన్నారు.

ఆవిధంగా హజ్రత్ ఉమర్ (రజి) ఖలీఫా అబూబకర్ (రజి)ను వెంట బెట్టుకొని ప్రభుత్వ కాశాధికారి హజ్రత్ అబూఉబైదా (రజి)ని కలుసు కున్నారు. ఆయనకు విషయం తెలియజేసి ఖలీఫా జీతభత్యాల కోసం సగటుపౌరుని ఆదాయం దృష్టిలో పెట్టుకొని సాలీనా దాదాపు నాలుగువేల దిర్హమ్‌లు నిర్ణయించారు. అయితే అబూబకర్ (రజి) రెండేళ్ళ పాలన తర్వాత మరణసమయం సమీపించినప్పుడు తన ఆస్తి నుంచి ఎనిమిది వేల దిర్హమ్‌లు తీసి ప్రభుత్వధనాగారానికి వాపసు చేయాలని వీలునామా రాశారు. (కన్జుల్ ఉమ్మాల్)

"రాత్రింబవళ్ళు బహిరంగంగానూ, గోప్యంగానూ (దైవమార్గంలో) తమ సంపదను ఖర్చు చేసేవారి కోసం తగినప్రతిఫలం వారి ప్రభువు దగ్గర సిద్ధం గా ఉంది. వారికి ఎలాంటి భయం, దుఃఖం ఉండదు." (ఖుర్ఆన్-2:274)

"మీరు (దైవమార్గంలో) ఖర్చు చేసిందయినా, లేక మీరు మొక్కుబడి చేసుకున్నదైనా, అంతా దేవునికి తెలుసు. దుర్మార్గులకు ఎవరూ సహాయం చేయరు. మీరు దానధర్మాలు బహిరంగంగా చేసినా మంచిదే; ఒకవేళ మీరు ఇతరుల కంట పడకుండా రహస్యంగా అగత్యపరులకు దానం చేస్తే అది మరీ మంచిది. అలాంటి దానం మీ పాపాలను కడిగివేస్తుంది. మీరు చేసేదంతా దేవునికి తెలుసు." (ఖుర్ఆన్-2:270,271)



## అపూర్వ త్యాగం-8

ఓసారి దైవప్రవక్త (స) దగ్గరికి ఒక వ్యక్తి (అతిథిగా) వచ్చాడు. దైవప్రవక్త (స) అతనికి భోజనం ఏర్పాటుచేయమని తన భార్యలతో అన్నారు. దానికి వారు "మా దగ్గర మంచినీరు తప్ప మరేమీ లేద"ని చెప్పారు.

అప్పుడు దైవప్రవక్త (స) తమ అనుచరులను సంబోధిస్తూ "మీలో ఇతనికి ఆతిథ్యమిచ్చేవారు ఎవరయినా ఉన్నారా?" అని అడిగారు. ఒక అన్సారీ ముస్లిం లేచి "నేనాతిథ్యమిస్తాను" అన్నాడు.

ఆ తరువాత అతనా వ్యక్తిని ఇంటికి పిలుచుకెళ్ళి "ఇతను ప్రవక్తగారి అతిథి. ఇతనికి మనం భోజనం పెట్టాలి" అన్నాడు భార్యతో. దానికామె "పిల్లల కోసమే కాస్తుంది" అన్నది. "ముందు భోజనం తయారుచెయ్యి. పిల్లలు అన్నం అడిగితే ఏదోచెప్పి వాళ్ళను నిద్రపుచ్చు"అన్నాడతను.

కాస్సేపటికి ఆయన భార్య భోజనం తయారుచేసి దీపం వెలిగించింది. పిల్లల్ని (ఏదోచెప్పి) పడుకోబెట్టింది. ఆ తర్వాత ఆమె లేచి దీపం (వత్తిని) సరిచేస్తున్నట్లు నటిస్తూ ఆర్పింది. ఆ చీకటిలోనే వారిద్దరు తాము కూడా అన్నం తింటున్నట్లు అతిథికి అన్పించేలా నోళ్ళు కదపసాగారు. ఇలా వారిద్దరు ఆరాత్రి అతిథికి అన్నంపెట్టి తాము పస్తుండిపోయారు. మర్నాడు ఉదయం ఆ అన్సారీ ప్రవక్త సన్నిధికి వెళ్ళగానే "ఈరోజు మీరు చేసిన పనిని దేవుడు చూసి సంతసించాడు. సంతసించి ఈసూక్తి అవతరింప జేశాడు" అంటూ ఆయన ఈ క్రింది సూక్తి పఠించారు. (బుఖారి, ముస్లిం)

"(మక్కా నుండి) తమ దగ్గరకు (మదీనా) వలసవచ్చిన వారిని వీరు అభిమానిస్తున్నారు. వీరికి ఏదిచ్చినా అది తమకు అవసరమని వీరు తమ హృదయాల్లో సైతం ఆకాంక్షించరు. వారు స్వయంగా నిరుపేదలైనప్పటికీ ఇతరుల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తారు." (ఖుర్ఆన్-59:9)

మొదటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ (రజి) పరిపాలిస్తున్న కాలం. ఒకసారి మదీనాలో కరువు వచ్చింది. జనం తిండి గింజల కోసం అల్లాడిపోసాగారు.

ఓరోజు ఖలీఫా ప్రజలదుస్థితి చూసి "ఈరోజు సాయంత్రాని కల్లా దేవుడు మీ బాధ దూరం చేస్తాడు" అని జోస్యం చెప్పారు.

కాకతాళీయంగా అదే రోజు సాయంత్రం సిరియా నుంచి హజ్రత్ ఉస్మాన్ (రజి)కు చెందిన వాణిజ్య బిడారాలు వచ్చాయి. వేయి ఒంటెల మీద ఆహార ధాన్యాల బస్తాలు కిటకిటలాడుతున్నాయి. సిరియా నుంచి ఉస్మాన్ (రజి) గారి సరుకు వచ్చిందని తెలియగానే మదీనాలోని పెద్ద పెద్ద వర్తకులంతా బేరమాడటానికి మార్కెట్‌కు వచ్చేశారు.

ఉస్మాన్ (రజి) వర్తకుల్ని ఉద్దేశించి "సిరియా నుంచి దిగుమతి అయిన ఈ సరుకుపై మీరు నాకు ఎంత లాభం ఇవ్వగలరు?" అని అడిగారు.

"మీరు సరుకును పది రూపాయలకు కొంటే దానికి నేను పన్నెండు రూపాయలు ఇస్తాను" అన్నాడు ఒక వ్యాపారి.

"నాకు దానికంటే ఎక్కువ లాభం వస్తుంది" అన్నారు ఆయన.

"అట్లయితే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పదమూడు రూపాయలు ఇస్తాను" అన్నాడు మరో వ్యాపారి వేలంపాట పెంచుతూ.

"నాకు ఇంతకంటే ఎక్కువ లాభం వచ్చే అవకాశముంది."

"సరే పది రూపాయల కొనుగోలు ధరపై నేను పధ్నాలుగు రూపాయలు ఇస్తాను, వదిలేయండి" అన్నాడు వేరొక వర్తకుడు.

"ఉహూ, ఆ లాభం నాకు చాలదు. నాకు దానికంటే కూడా ఎక్కువ లాభం వచ్చే అవకాశం ఉంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

"పోనీ, మరో రూపాయి పెంచుతున్నా, సరుకు వదిలేయండి."

"లాభం లేదు. నాకు ఇంతకంటే కూడ ఎక్కువ లాభం వచ్చే చాన్సుంది" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి) తల పైకెత్తి ఆకాశం వైపు చూస్తూ.

"ఏమిటీ ఇంతకంటే ఎక్కువ లాభమా! ఎవరండీ మీకింత కంటే ఎక్కువ లాభం ఇస్తానంటున్నది?" అన్నారు వర్తకులంతా ఆశ్చర్యపోతూ.



"నాకు పది రూపాయల సరుకు మీద వంద రూపాయలు ధర లభిస్తుంది. మీరు ఇంతకంటే ఎక్కువ ధర పెట్టి ఈ సరుకు కొనగలరా?" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అంటే పది రూపాయల పెట్టుబడికి తొంభయి రూపాయలు లాభం వస్తుందన్న మాట! ఈ మాటలు విన్న వర్తకులు నోరెల్లబెట్టి మరింత ఆశ్చర్యపోయారు.

"ఇది మరీ చోద్యంగా ఉంది. మేమ్మటుకు అంత ధర పెట్టలేమండీ!" అన్నారు వారు నిరాశతో ఢీలా పడిపోయి.

"అయితే వినండి. నేనీ మొత్తం సరుకును దైవమార్గంలో దానం చేస్తున్నాను. దీనికి మీరే సాక్షులు. దేవుడే నా పెట్టుబడిపై పదింతలు లాభం ప్రసాదించేవాడు" అన్నారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

ఈ సంగతి వినగానే తిండిగింజల కోసం కటకటలాడుతున్న పేద ప్రజలు ఎంతో సంబరపడిపోయారు. సిరియా నుంచి వచ్చిన మొత్తం వేయి ఒంటెల ఎత్తు ఆహారధాన్యాలు అప్పటికప్పుడు పేదలకు దానం చేశారు హజ్రత్ ఉస్మాన్ (రజి).

అదే రోజు రాత్రి హజ్రత్ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి) ఓ విచిత్రమైన కల గన్నారు. మహాప్రవక్త ముహమ్మద్ (స) జ్యోతిర్మయ దుస్తులు ధరించి టర్కీజాతి తెల్లగుర్రం ఎక్కి ఎక్కడికో బయలుదేరుతున్నట్లు ఆయన కలలో కన్పించారు.

అప్పుడాయన "దైవప్రవక్తా! మీరు హడావిడిగా ఎక్కడికి వెళ్తున్నారు? నా హృదయం మాత్రం మీ దర్శనం కోసం తహతహలాడుతోంది" అన్నారు.

"ఈరోజు ఉస్మాన్ (రజి) వేయి ఒంటెల ఆహారధాన్యాలు దానం చేశాడు కదా! ఆయన చేసిన ఈ దానాన్ని దేవుడు స్వీకరించి, దానికి ప్రతిఫలంగా ఒక స్వర్గకన్యతో ఆయన వివాహం జరిపిస్తున్నాడు. నేనా వివాహమహోత్సవం లో పాల్గొనడానికి వెళ్తున్నా" అన్నారు దైవప్రవక్త (స).

## దైవభీతిపరాయణత-9

"మానవులారా! మేము మిమ్మల్ని ఒకే స్త్రీపురుష జంట నుండి పుట్టించాము. తర్వాత మీ పరస్పరపరిచయం కోసం మిమ్మల్ని విభిన్న జాతులుగా, తెగలుగా చేశాము. అయితే మీలో అందరికంటే ఎక్కువ భయభక్తులు కలవాడే దేవుని దృష్టిలో ఎక్కువ గౌరవనీయుడు." (ఖుర్ఆన్-49:13)

దైవభీతి పరాయణతను ఇస్లాం 'తఖ్వా' అంటుంది. తఖ్వా అంటే భయం లేక భీతి అని శాబ్దిక భావం. ఇస్లామీయ పరిభాషలో తఖ్వా అంటే దైవభీతి. సృష్టికర్త చేయమన్న పనులను చేయడం, ఆయన వారించిన పనులను మానేయడమే దైవభీతిపరాయణత (తఖ్వా) అనబడుతుంది.

"విశ్వాసులారా! మీరు దేవునికి భయపడవలసిన విధంగా భయపడండి. (దేవునికి అంకితమైన) ముస్లింలుగా వున్న స్థితిలో తప్ప (ఇతర స్థితిలో) చనిపోకండి." (ఖుర్ఆన్-3:102)

'దైవభీతి' హృదయంలో జనించి ఆచరణలో వ్యక్యమయ్యే విషయం. విశ్వాసి హృదయంలో నిజంగా దైవభీతి ఉంటే దైవేతరుల ఆజ్ఞలు, సిద్ధాంతాల సమక్షంలో దేవుని ఆజ్ఞలు, సిద్ధాంతాలను మాత్రమే అతను పాటించాలి. వాటికి వ్యతిరేకంగా వ్యవహరిస్తే అతని దైవభీతి ఆచరణలో వ్యక్తం కాలేదన్న మాట. ఖుర్ఆన్‌లో సృష్టికర్త మన మేలుకోరి అనేక ఆదేశాలు, ఉపదేశాలిస్తూ ఆ వెనువెంటనే "దేవునికి భయపడండి, ఆయన మీ చర్యల్ని గమనిస్తున్నాడని తెలుసుకోండి' అని కూడా చెబుతున్నాడు.

"ఆదంసంతానమా! మీ మర్మావయవాల్ని కప్పుకోవడానికి, మీ దేహానికి రక్షణగా, అలంకరణగా ఉపయోగపడటానికి మేము మీకు దుస్తులు ప్రసాదించాం. అయితే భయభక్తుల దుస్తులే అన్నిటికంటే శ్రేష్ఠమైనవి." (ఖు-7:26)

"హజ్‌యాత్రకు బయలుదేరినప్పుడు ప్రయాణసామగ్రి వెంట తీసి కెళ్ళండి. అన్నిటికంటే శ్రేష్ఠమయిన ప్రయాణ సామగ్రి దైవభీతే. కనుక విజ్ఞులారా! నా పట్ల భయభక్తులు కలిగివుండండి." (ఖుర్ఆన్-2:197)



"మీరు ఒకభార్య వైపు పూర్తిగా మొగ్గి మరొకామెను డోలాయమాన స్థితిలో పడవేయకండి. మీ వైఖరి సరిదిద్దుకొని దేవునికి భయపడుతూ మసలుకోండి." (ఖుర్ఆన్-4:129)

"విశ్వాసులారా! మీరు గనక భయభక్తుల వైఖరి అవలంబిస్తే దేవుడు మీకు మంచీ చెడుల విచక్షణాజ్ఞానం ప్రసాదిస్తాడు; మీలో ఉన్న చెడుగులు తొలగిస్తాడు; మీ తప్పులు మన్నిస్తాడు." (ఖుర్ఆన్-8:29)

"దేవునికి భయపడుతూ వ్యవహరించేవాడికి దేవుడు కష్టాల నుంచి బయటపడేందుకు ఏదైనా దారిచూపుతాడు. (ఒకవేళ ఆర్థిక ఇబ్బందులు ఉంటే) అతనికి దేవుడు అతని ఊహ సైతం పోని దిశనుండి ఉపాధినిస్తాడు. దేవుడ్ని నమ్ముకునే వాడికి దేవుడే చాలు." (ఖుర్ఆన్-65:2)

ప్రవక్త (స) ప్రియఅనుచరుడు ఉమర్ (రజి) ఇలా అన్నారు: "ఎవరైనా నీపట్ల వ్యవహరించడంలో దేవునికి భయపడకపోతే, నీవు మాత్రం దేవునికి భయపడ్తూ అతని పట్ల వ్యవహరించు. ఇదే అతనికి తగిన శిక్ష."

మనిషి తన సృష్టికర్త జారీచేసిన ఆజ్ఞలన్నీ తెలుసుకోవాలంటే ప్రతి రోజూ దైవగ్రంథం యోచనా దృష్టితో పఠిస్తూఉండాలి. అప్పుడే అతనిలో నిజమైన దైవభీతి జనిస్తుంది. దైవభీతే మనిషిని పాపకార్యాల నుండి వారించి సత్కార్యాల వైపుకు పురిగొల్పుతుంది.

"వారు తమ ప్రభువుకు ఎల్లప్పుడూ భయపడుతుంటారు. కఠినంగా (కర్మ)విచారణ జరుగుతుందేమోనని భయపడుతుంటారు. తమ ప్రభువు ప్రసన్నతను ఆశిస్తూ సహనంతో వ్యవహరిస్తారు." (ఖుర్ఆన్-13:21)

పూర్వం ఖురాసాన్ పట్టణంలో అబ్దుల్లా అనే ఒక యువకుడు ఉండేవాడు. అతను తన తల్లిదండ్రులకు ఏకైక సంతానం. ఏకైక సంతానాన్ని తల్లిదండ్రులు సహజంగానే అల్లారుముద్దుగా పెంచుతారు. అబ్దుల్లాను అతని తల్లిదండ్రులు కూడా అలాగే పెంచారు. దాంతో అబ్దుల్లా త్రాగుడు, జూదం, వ్యభిచారం వగైరా దుర్వ్యసనాలకు అలవాటుపడి విశృంఖుల

జీవితం గడపసాగాడు. తల్లిదండ్రులు ఎన్ని విధాల హితోపదేశం చేసినా అతని చెవులకు ఎక్కేదికాదు.

ఒకరోజు రాత్రి అబ్దుల్లా తన స్నేహితులతో కలసి మందుపార్టీ జరుపు కుంటూ, మత్తులో తేలిపోయాడు. మద్యం మత్తులోనే కాస్సేపటికి నిద్ర పోయి స్వప్నలోకంలో విహరించసాగాడు. ఎంతో అందమైన ఉద్యానవనం లో ఓ చెట్టుకొమ్మ మీద కూర్చున్న ఒక చిలకమ్మ సుమధుర స్వరంతో "విశ్వాసుల హృదయాలు దేవుని ప్రస్తావనతో ద్రవించిపోయే సమయమింకా రాలేదా?" (ఖుర్ఆన్-57:16) అంటూ పాడసాగింది.

అబ్దుల్లా ఈ పలుకులు వినగానే అదరిపోయి "దేవా! నా దైవమా! ఆ సమయం వచ్చేసింది"అంటూ చివాలున లేచాడు. లేవగానే మధుపాత్రలు నేలమీద విసరికొట్టాడు. తాంబుర తీగలు లాగే విరగ్గొట్టాడు. వంటి మీది రంగులచొక్కా చించిపారేశాడు. స్నానం చేసి దైవసన్నిధిలో మోకరిల్లాడు. పశ్చాత్తాపంతో కుమిలిపోతూ దైవాన్ని క్షమాపణ వేడుకుంటూ ఇకనుంచి ఎలాంటి పాపానికీ, చెడుకూ పాల్పడనని గట్టిగా వాగ్దానం కూడా చేశాడు.

ఆయనే యావత్ ముస్లింజగత్తులో గొప్ప దైవప్రియుడిగా, ప్రముఖ హదీసువేత్తగా ప్రసిద్ధిచెందిన అబ్దుల్లా బిన్ ముబారక్ (రహ్మలై).

దైవభీతికి సంబంధించిన మరికొన్ని ఉదాహరణలు వినండి:

రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ (రజి) ముందు ఒకతను "నీ ప్రభువు శిక్ష తప్పకుండా వచ్చి తీరుతుంది. దాన్ని ఏ శక్తీ అడ్డుకోజాలదు" అనే ఖుర్ఆన్ సూక్తి పఠించాడు. అంతే, ఈ సూక్తి వినగానే ఉమర్ (రజి) నిలువునా వణికిపోతూ ఒకేఒక పొలికేక పెట్టారు. ఆ తర్వాత స్పృహతప్పి పడిపోయారు. వెంటనే స్నేహితులు ఆయన్ని ఎత్తుకొని ఇంటికి చేర్చారు. ఈ దైవభీతితో ఆయన నెలరోజుల దాకా అస్వస్థతకు గురైఉన్నారు.

ఖలీఫా ఉమర్ (రజి) యథాప్రకారం ఓరోజు రాత్రివేళ రాజధాని మదీనాలో గస్తీ తిరగసాగారు. అలా తిరుగుతుంటే ఓ ఇంటి ముందు ఒక



ముసలమ్మ గేదెపాలు పితకుతోంది. ఉమర్(రజి) ఆమెను ఉద్దేశించి "బామ్మా! పాలలో ఏమాత్రం నీళ్ళు కలపకు. ప్రజల్ని మోసగించకూడదు" అనిచెప్పారు. దానికామె "విశ్వాసులనాయకా! మీరు నిశ్చింతగా ఉండండి. నేనలా ఎన్నటికీ చేయను"అన్నది. ఉమర్(రజి) ఈమాట విని ముందుకు సాగారు. అయితే కొన్నాళ్ళ తరువాత ఉమర్ (రజి) రాత్రివేళ గస్తీ తిరుగుతూ అదే ఇంటి పక్కగా నడుస్తుంటే లోపల్నుంచి తల్లీకూతుళ్ళ మాటలు ఇలా విన్పించాయి:

"అమ్మాయ్! తెల్లవారు కావస్తోంది. లేచి తొందరగా పాలలో నీళ్ళు కలుపు."

"అమ్మా! పాలలో నీళ్ళు కలపడం చట్టపరంగా నేరం. మన ఖలీఫా కూడా పాలలో నీళ్ళు కలపవద్దని హెచ్చరించారు. నేనెల నీళ్ళు కలపను?"

"ఇప్పుడు ఖలీఫా వచ్చి చూడబోతున్నాడా ఏమిటీ? తొందరగా నీళ్ళు కలుపు."

"ఖలీఫా చూడకపోయినా భూమ్యాకాశాల యజమాని చూస్తూనే ఉన్నాడు కదా! మనం ఖలీఫా, ఆయన రక్షకభటుల కళ్ళుకప్పగలం కాని, సృష్టికర్త కళ్ళు కప్పలేము. నేను మాత్రం ఎన్నటికీ పాలలో నీళ్ళు కలపలేను."

హజ్రత్ ఉమర్ (రజి) ఈసంభాషణ విని వెళ్ళిపోయారు. మరునాడు కొడుకుల్ని పిలిచి విషయం చెబుతూ "ఆ అమ్మాయిని నేను నా కోడలిగా చేసుకోదలిచాను. మీలో ఆ అమ్మాయిని ఎవరు చేసుకుంటారో చెప్పండి, నేనెళ్ళి అమ్మాయి తల్లితో మాట్లాడుతాను" అని అన్నారు. అప్పుడు ఆసిమ్ (రజి) ముందుకు వచ్చి "నాన్నా! నేను చేసుకుంటాను" అన్నారు.

ఆ తర్వాత ఉమర్ (రజి) ఆ ముసలమ్మ ఇంటికి వెళ్ళారు. ఖలీఫాను చూడగానే ఆమె కంగారుపడిపోతూ ఓ చాప పరిచింది కూర్చోమంటూ. ఉమర్ (రజి) చాపపై కూర్చుంటూ "నేను మీ అమ్మాయిని నా కోడలుగా చేసుకోదలిచాను. నీ అభిప్రాయం ఏమిటో చెప్పు" అని అన్నారు.

ఈమాట వినగానే ముసలమ్మ కొయ్యబారిపోయి గుడ్లప్పగించి చూడ సాగింది. తరువాత ఆశ్చర్యం నుంచి తేరుకొని "విశ్వాసుల నాయకా! పూరి గుడిసెలో ఉండే ఈ పేదరాలు ఎక్కడా, ఓ పెద్ద స్రామాజ్యానికే అధినేత అయిన తమరెక్కడా! అంతకంటే గొప్ప అదృష్టం ఈ దీనురాలికి మరేం కాగలుగుతుంది" అని అన్నది ఆనందాశ్రువులు రాల్చుతూ. లోపల్నుంచి ఈమాటలు విన్న ఆ యువతి సంతోషం సరేసరి.

అలా ఖలీఫా కుమారుడు ఆసిమ్ (రజి) వివాహం ఆ పేద యువతితో జరిగిపోయింది. వారిద్దరికి ఉమ్మెఆసిమ్ అనే బాలిక జన్మించింది. అప్పటి స్రామాజ్యాధినేత అబ్దుల్ అజీజ్ బిన్ మర్వాన్‌తో ఉమ్మెఆసిమ్ వివాహం జరిగింది. వారిద్దరి ముద్దుబిడ్డే రెండవ ఉమర్‌గా, సన్మార్గగాముడైన ఐదవ ఖలీఫాగా విశ్వవిఖ్యాతి చెందిన ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ (రహ్మలై).

పూర్వం బస్రా పట్నంలో ఓ భూస్వామి ఉండేవాడు. అతనొక రోజు తన తోటలోని మహల్‌లోకి ప్రవేశించినప్పుడు అతని దగ్గర పనిచేసే ఒక సేవకుడు, అతని అందాల కుమార్తె కన్పించారు. భూస్వామి ఆ యువతిని చూడగానే అతని మనస్సు అదుపు తప్పింది. అతను సేవకుణ్ణి ఏదో పని మీద బయటికి పంపివేశాడు.

ఆ తరువాత భూస్వామి ఆ యువతిని "మహల్ తలుపులన్నీ మూసెయ్యి" అని ఆదేశించాడు. యువతి తలుపులన్నీ మూసి వచ్చింది. భూస్వామి ఆమెను తదేకంగా చూస్తూ "తలుపులన్నీ మూశావా?" అని అడిగాడు. దానికా యువతి "తలుపులన్నీ మూశాను దొరా! కాని ఒక తలుపు మాత్రం మూయలేక పోయాను" అన్నది.

భూస్వామి ఆమె వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటీ, ఒక తలుపు మూయలేక పోయావా? ఏ తలుపది?" అని అడిగాడు.

దానికా యువతి సమాధానమిస్తూ "ఏ తలుపు గుండా మీ ప్రభువు, నా ప్రభువు అయిన విశ్వపాలకుడు మనల్ని చూస్తున్నాడో ఆ తలుపును నేనెలా మూసేయ గలుగుతాను?" అని అన్నది.



ఈమాట వినగానే భూస్వామి నెత్తిమీద పిడుగు పడినట్లు అదిరి పడ్డాడు. సిగ్గుతో కుంచించుకుపోతూ వెంటనే ఆ యువతికి క్షమాపణ చెప్పుకున్నాడు. తనను పాపకార్యం నుండి కాపాడిన దేవునికి కృతజ్ఞతలు కూడా చెప్పుకున్నాడు.

## సహనం, సాహసం-10

సహనం సాహసానికి ప్రతిరూపం. స్థిరత్వం సహనానికి దర్పణం. సహనం, సాహసం, స్థిరత్వాలు ఒకదానికొకటి అవినాభావ సంబంధాలు కలిగిన సుగుణాలు, విశ్వాసికి తప్పక ఉండవలసిన లక్షణాలు. వాటిని గురించి ఈక్రింది ఖుర్‌ఆన్ సూక్తులు గమనించండి:

"దేవుడే తమ ప్రభువని పలికి, ఆ మాట పైన్నే స్థిరంగా ఉండేవారికి (పరలోకంలో) ఎలాంటి భయంగాని దుఃఖంగాని ఉండదు." (46:13,14)

"విశ్వాసులారా! సహనం వహించి, ప్రార్థన చేస్తూ (మా) సహాయం అర్థిస్తూ ఉండండి. దేవుడు సహనం వహించేవారికే తోడుగా ఉంటాడు." (2:153); "సహనం వహించేవారికి మేము వారి సత్కర్మలకు తప్పక శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాం." (ఖుర్‌ఆన్-16:96)

"మీరు ప్రతీకారం తీర్చుకోదలచుకుంటే మీపై ఏమేరకు దౌర్జన్యం జరిగిందో ఆమేరకే ప్రతీకారం తీర్చుకోండి. కాని మీరు సహనం వహిస్తే (మంచిది)." (ఖుర్‌ఆన్-16:126)

"విశ్వాసులారా! సహనం పాటించండి. మిథ్యావాదుల ముందు ధైర్య సాహసాలు ప్రదర్శించండి. ధర్మసేవ కోసం నడుం బిగించండి. దేవుని పట్ల భయభక్తులు కలిగిఉండండి. అప్పుడే మీరు (ఇహపరాల్లో) కృతార్థులవు తారని ఆశించగలరు." (ఖుర్‌ఆన్-3:200)

దైవప్రవక్త (స) హితోక్తి: "దేవుడు యాచించకుండా ఉండటానికి ప్రయ త్నించేవాణ్ణి కాపాడుతాడు; నిరపేక్షాభావం అలవరచుకోవాలనుకున్న మనిషిని నిరపేక్షాపరునిగా చేస్తాడు; సహనం కోరే వ్యక్తికి సహనం వహించే

సద్బుద్ధి ప్రసాదిస్తాడు. మనిషికి ఇవ్వబడిన కానుకల్లో సహనం కంటే శ్రేష్ఠమైన గొప్ప కానుక మరేదీ లేదు." (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "విశ్వాసి వ్యవహారం చాలా వింతగా ఉంది. అతను చేసే ప్రతి పనిలో అతనికి మేలుంటుంది. విశ్వాసికి తప్ప మరెవరికీ ఈభాగ్యం ప్రాప్తించలేదు. అతనికి ఆనంద ఘడియల్లో అతను దైవానికి కృతజ్ఞతలు సమర్పించుకుంటాడు. ఈ కృతజ్ఞత వల్ల అతనికే మేలు కలుగుతుంది. (పుణ్యం లభిస్తుంది). ఒకవేళ కష్టాలు వస్తే సహనం వహిస్తాడు. ఈ సహనం కూడా అతనికి మేలే కలగజేస్తుంది." (ముస్లిం)

ఇబ్నెఅబ్బాస్ (రజి) కథనం: ఓ స్త్రీ దైవప్రవక్త (స) సన్నిధికి వచ్చి 'నాకు మూర్ఛ రోగముంది. దానివల్ల నా ఒంటిపై ఆచ్ఛాదనం తొలగిపోతోంది. నా కోసం దుఆ చేయండి" అన్నది. దానికి దైవప్రవక్త "నువ్వు సహనం వహిస్తే నీకు స్వర్గం లభిస్తుంది లేదా నువ్వు కోరితే దేవుడు నీకు ఈవ్యాధి నుండి ఉపశమనం కలిగించాలని నేను దుఆ చేస్తాను" అన్నారు. అందుకామె "సరే ఓర్పు వహిస్తాను. కాని నాఒంటిపై ఆచ్ఛాదన తొలగిపోతోంది. నేను నగ్నం కాకుండా ఉండాలని మాత్రం దైవాన్ని ప్రార్థించండి" అని అన్నది. ఆ స్త్రీ కోరిక మేరకు దైవప్రవక్త (స) ఆమె కోసం దుఆ చేశారు. (బుఖారీ, ముస్లిం)

హజ్రత్ అనస్ (రజి) కథనం: ఉమ్మెసులైమ్ (రజి) ద్వారా అబూతల్హా (రజి)కు పుట్టిన పిల్లవాడొకడు చనిపోయాడు. అప్పుడు ఉమ్మెసులైమ్ ఇంట్లో వాళ్ళని బాబు చనిపోయాడన్న సంగతి అబూతల్హాకు చెప్పవద్దని, నేనే ఆయనకు తెలియజేస్తానని చెప్పారు. (కొంత సేపటికి) అబూతల్హా (రజి) ఇంటికి వచ్చారు. ఉమ్మెసులైమ్ (రజి) ఆ రాత్రి ఆయనకు అన్నం వడ్డించారు. తర్వాత ఆమె మునుపటికన్నా బాగా అలంక రించుకొని అందంగా ముస్తాబయి భర్త దగ్గరికి వచ్చారు. ఆయన ఆమెతో సంయోగం జరిపారు. ఆయన రతిలో పూర్తిగా తృప్తిచెందారని నిర్ధారించుకున్న తర్వాత-

ఆమె తన భర్తను "అబూతల్హా! కొందరు ఓ కుటుంబానికి ఏదైనా వస్తువు తాత్కాలికంగా వాడుకోవటానికి ఇచ్చారనుకోండి. ఆ తరువాత వారు



తమ వస్తువుని తిరిగిచ్చేయమని అడిగితే ఆ కుటుంబం ఇవ్వకుండా ఉండటం భావ్యమేనా?" అని ప్రశ్నించారు. దానికి అబూతల్హా (రజి) "కాదు, అది సరైన పద్ధతి కాద"ని అన్నారు. అప్పుడామె "అయితే మీరు మన బాబు విషయంలో దైవం నుండి పుణ్యం ఆశించండి" అన్నారు. అబూతల్హా ఈమాట విని "నాకీ సంగతి ముందుగా ఎందుకు చెప్పలేదు? నేను నీతో కలిసి మలినమైన తరువాత బాబు చనిపోయాడన్న సంగతి చెబుతావా?" అని రుసరుసలాడారు.

తరువాత ఆయన దైవప్రవక్త (స) సన్నిధికి వెళ్ళి జరిగినదంతా వివరించారు. అది విని దైవప్రవక్త (స) "మీరిద్దరు కలిసిన రాత్రిలో దేవుడు మీకు శుభం కలగజేయుగాక!" అని ప్రార్థించారు. ఆ తరువాత (కొంత కాలానికి) ఉమ్మెసులైమ్ (రజి) మళ్ళీ గర్భవతిఅయ్యారు. (బుఖారి, ముస్లిం)

## నోటిదురుసు, దుర్భాష-11

నోరు మంచిదయితే ఊరు మంచిదవుతుందంటారు. నోరు ఎన్నెన్నో మంచి పనులు చేస్తుంది. మనిషి గౌరవమర్యాదల్ని పెంచి, సంఘంలో అతనికి మంచి స్థానం సమకూర్చి పెడ్తుంది. అయితే అదుపుతప్పితే ఈనోరే మనిషికి ఇహపరాల్లో ఎన్నో ఆపదలు తెచ్చిపెడ్తుంది. దేవుని దృష్టిలో నోటి దురుసు, దుర్భాష, అశ్లీలం ఘోరమైన నేరాలు. వీటిని గురించి దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు:

"ప్రళయదినాన విశ్వాసి త్రాసులో ఉంచబడే బరువైన వస్తువు అతని సత్ప్రవర్తనే. అశ్లీలమాటలు పలికేవాడ్ని, దుర్భాషలాడేవాడ్ని దేవుడు అసహ్యించుకుంటాడు." (తిర్మిజి)

"మృదుస్వభావం లేనివాడిలో మంచితనం ఉండదు." (జరీర్-ముస్లిం)

ఒకతను దైవప్రవక్త (స) దగ్గరకు వచ్చి "ఫలానా స్త్రీ ఎన్నో నఫిల్ నమాజులు చేస్తుంది. మరెన్నో నఫిల్ రోజాలు పాటిస్తుంది. (పెద్దఎత్తున) దానధర్మాలు కూడా చేస్తుంది. ఈ సత్కార్యాలలో ఆమె పేరుపొందింది.

కాని ఆమె తరచుగా నోటితో ఇరుగుపొరుగువారిని బాధిస్తుంది" అన్నాడు. దానికి దైవప్రవక్త (స) "అయితే ఆమె నరకానికి పోతుంది" అన్నారు. తిరిగి ఆ వ్యక్తి ఇలా అన్నాడు: "దైవప్రవక్తా! ఫలానాస్త్రీ నఫిల్ ఉపవాసాలు చాలా అరుదుగా పాటిస్తుంది. నఫిల్ నమాజులు కూడా చాలా తక్కువ గానే ఆచరిస్తుంది. అప్పుడప్పుడు కొన్ని జున్నుగడ్డల్ని దానం చేస్తుందని ప్రతీతి. అయితే ఆమె తన నోటితో ఇరుగుపొరుగువారిని బాధించదని జనం చెప్పుకుంటారు.'' దైవప్రవక్త ఈమాట విని ''ఆమె స్వర్గవాసి అవుతుంద''ని చెప్పారు. (మిష్కాత్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఎవరి నోటి మూలంగా, చేతుల మూలంగా తోటిముస్లిలు బాధపడకుండా ఉంటారో అతనే (నిజమైన) ముస్లిం. అలాగే దేవుడు మానేయమన్న వాటిని మానేసేవాడే ముహాజిర్ (దైవమార్గంలో వలసపోయినవాడు).'' (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "తన రెండు దవడల మధ్య ఉన్నదాన్ని గురించి, రెండు కాళ్ళ మధ్య ఉన్నదాన్ని గురించి నాకు హామీ ఇచ్చే మనిషికి నేను స్వర్గం గురించి హామీ ఇస్తాను.'' (బుఖారీ, ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "దాసుడు అనాలోచితంగా ఒక మాట అంటాడు. అది మంచా లేక చెడా అని ఆలోచించడు. కాని దాని మూలంగానే అతను తూర్పు పడమరల మధ్య ఉండే దూరం కన్నా ఎక్కువ దూరం నరకం వైపు పడిపోతాడు.'' (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి : ''దాసుడు పరధ్యానంలో ఉండి దేవునికి నచ్చే మాట మాట్లాడేస్తాడు. దానివల్ల దేవుడు అతని అంతస్తులెన్నో పెంచుతాడు. అయితే దాసుడు ఒక్కోసారి పరధ్యానంలో ఉండి దేవునికి ఆగ్రహం తెప్పించే మాటంటాడు. దానివల్ల అతను నరకంలో పడిపోతాడు."(బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి: ''విశ్వాసి ఎత్తిపొడిచేవాడు, శాపనార్థాలు పెట్టే వాడు, బూతుమాట్లాడేవాడు, దురుసుగా మాట్లాడేవాడు కాలేడు.'' (తిర్మిజీ)



ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి) కథనం: నేను దైవప్రవక్త (స)ను అడిగాను, "ముక్తికి మార్గం ఏద"ని. అందుకాయన "నీ నోటిని అదుపులో పెట్టుకో. నీ ఇల్లు నిన్ను తనలో ఇమిడ్చుకోవాలి (నీ తీరిక సమయం నీఇంట్లో గడవాలి.) నీ పొరపాట్లు తలచుకొని రోదించు"అని ఉపదేశించారు. (తిర్మిజీ)

దైవప్రవక్త (స) ప్రవచనం: "తెల్లవారుజామున మనిషి శరీరంలోని అవయ వాలన్నీ నాలుకను అతి దీనంగా బతిమాలుతాయి. "నువ్వు మా విషయంలో దేవునికి భయపడి మసలుకో. మా వ్యవహారం నీతో ముడిపడిఉంది. నువ్వు సవ్యంగాఉంటే మేమూ సవ్యంగా ఉండగలుగుతాం. నువ్వు వక్రతకు లోనైతే మేమూ వక్రతకు లోనైపోతాము.'' (తిర్మిజీ)

హజ్రత్ అబూహురైరా (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "పరస్పరం దూషించుకునే ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు ఏమేమి అనుకుంటారో దాని పాపమంతా మొదట తిట్లు ప్రారంభించినవాని మీదే పడుతుంది- పీడితుడు హద్దు మీరి ప్రవర్తించనంతవరకు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం : ''మరణించినవారు తాము చేసుకున్న కర్మలకు చేరుకున్నారు. కాబట్టి వారిని దూషించకండి.'' (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి : ''సత్యం చెప్పేవాడు శాపనార్థాలు పెట్టేవాడు కారాదు. అది సత్యవంతుడికీ శోభించదు.'' (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: ''(చీటికి మాటికీ) శాపనార్థాలు పెట్టేవారు ప్రళయదినాన సాక్షులు, సిఫారసుకర్తలు కాలేరు.'' (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : ''దేవుని శాపం తగలాలని, ఆయన ఆగ్రహం విరుచుకుపడాలని, అగ్నితో శిక్షించబడాలని ఎవర్నీ శాపనార్థాలు పెట్టకండి." (అబూదావూద్, తిర్మిజీ)

దైవప్రవక్త (స) ఇలాఅన్నారు: ''దాసుడు ఎవరినైనా శపించినపుడు ఆ శాపం ఆకాశానికి ఎక్కుతుంది. కాని దాన్ని రానీయకుండా ఆకాశ ద్వారాలు మూయబడతాయి. దాంతో అది తిరిగి భూమి మీదకు వస్తుంది. కాని

భూమి ద్వారాలు కూడా మూయబడతాయి. తర్వాత అది కుడి ఎమడల వైపు పోవడానికి ప్రయత్నిస్తుంది. చివరికి ఎటూ పోలేక శపించబడినవాని దగ్గరికి పోతుంది. అతను గనక ఆ శాపానికి అర్హుడైతే (అతనికి తగులు తుంది) లేదా తిరిగి శపించినవాని దగ్గరికే వెళ్లిపోతుంది.'' (అబూదావూద్)

## నీతి, నిజాయితీలు-12

మనిషి అన్నాక నీతి ఎంతో అవసరం. ఆ నీతే లేకపోతే మనిషి పశువు కన్నా నికృష్టుడవుతాడు. అందుకే మన తెలుగునాట "నీతి లేనివాడు కోతి కంటే పాడు'' అన్న సామెత పుట్టింది. ఈ సామెత ప్రాతిపదికపైనే నీతిశతకాలు వెలువడ్డాయి. ఇక ఇస్లాంలోని ప్రతి ఆదేశంలోనూ నీతి సౌరభమే మనం ఆఘ్రాణిస్తాం. ఇస్లాంలోని విశ్వాసాలు, ఆరాధనలు, ఆదేశాలన్నీ మనిషిని నైతికంగా తీర్చిదిద్దడానికే నిర్దేశించబడ్డాయి. మనిషి మసీదులోనే కాదు, మార్కెట్‌లో, కార్యాలయంలో, కర్మాగారంలో, చట్టసభలో సైతం నీతిని వదలిపెట్టరాదని ఇస్లాం చెబుతోంది.

దైవప్రవక్త (స) ప్రవచనం : "అత్యున్నత నైతిక ప్రమాణాల పరిపూర్తి కోసమే నన్ను పంపడం జరిగింది.'' (ఇమామ్‌మాలిక్-మువత్తా)

దైవప్రవక్త (స) హితోక్తి : "విశ్వాసులలో అందరికంటే గొప్ప సద్గుణ సంపన్నుడే విశ్వాసంలోనూ పరిపూర్ణుడు.'' (అబూదావూద్)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దేవుని త్రాసులో మంచి నడవడిక కంటే బరువైన వస్తువు మరేదీ లేదు.'' (అబూదావూద్, తిర్మిజి)

దైవప్రవక్త (స) ప్రవచనం: "దైవభీతి, సద్గుణాలే స్వర్గ ప్రవేశానికి ఎక్కువ దోహదకారి అవుతాయి.'' (తిర్మిజి)

"దేవుడు అహంకారం, తలబిరుసుతనాలుగల ప్రతి దుర్మార్గుడి హృదయ కవాటాలు మూసివేస్తాడు." (ఖుర్‌ఆన్-40:35)

"జనమ్ముందు గర్వంతో మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నడవకు. తనను తాను పొగడుకునే, మిడిసిపడేవాడ్ని దేవుడు మెచ్చుకోడు." (ఖుర్‌ఆన్-31:18)



"మీరు ఆత్మశుద్ధిని గురించి గొప్పలు చెప్పుకోకండి. మీలో నిజమైన దైవభీతిపరుడెవరో దేవునికి బాగాతెలుసు." (ఖుర్‌ఆన్-53:32)

"విశ్వాసులారా! పురుషులు తోటిపురుషుల్ని హేళన చేయకూడదు. వీరి కంటే వారే మంచివారై ఉండవచ్చు. స్త్రీలు తోటిస్త్రీలను గేలి చేయకూడదు. వీరికంటే వారే మంచివారై ఉండవచ్చు. మీరు ఒకరి తప్పులు మరొకరు ఎత్తి చూపుకుంటూ పరస్పరం బురద చల్లుకోకండి. తప్పుడు పేర్లతో పిలుచుకోకండి. విశ్వాసభాగ్యం పొందిన తర్వాత చెడ్డపేరు తెచ్చుకోవడం చాలా తప్పు. ఈ వైఖరి మానుకోనివారే దుర్మార్గులు." (ఖుర్‌ఆన్-49:11)

దైవప్రవక్త (స) ప్రవచనం: "ఒక ముస్లిం తన తోటిముస్లిం సోదరుణ్ణి చులకనగా చూడటం చాలు అతను చెడ్డవాడని చెప్పటానికి. (ముస్లిం)

దైవప్రవక్త (స) హితోక్తి : "అసూయకు దూరంగా ఉండండి. అగ్ని కట్టెల్ని కాల్చినట్లు. అసూయ సత్కర్మల్ని భస్మీపటలం చేస్తుంది.'' (అబూదావూద్)

"అబద్ధాల కోరు, దుష్కర్ముడయిన ప్రతివాడికీ వినాశం (రాసిపెట్టి) ఉంది." (ఖుర్‌ఆన్-45:7)

దైవప్రవక్త (స) హితోక్తి : "నిస్సందేహంగా సత్యం సత్కార్యాల వైపుకు నడిపిస్తుంది. సత్కార్యాలు స్వర్గం వైపుకు దారితీస్తాయి. ఎవడైనా (సదా) సత్యం పలుకుతుంటే, చివరికతను సత్యసంధుడని దేవుని వద్ద రాయబడతాడు. నిస్సందేహంగా అబద్ధం పాపకార్యాల వైపుకు గొనిపోతుంది. పాపకార్యాలు నరకానికి చేర్చుతాయి. ఎవడైనా (నిత్యం) అబద్ధమే పలుకుతుంటే, అతను దేవునివద్ద అబద్ధాలమారిగా రాయబడతాడు.'' (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి: "నీవు అసత్యమైన ఒక విషయాన్ని నీసోదరునికి నిజమని నమ్మేటట్లు చెప్పడం మహా విశ్వాసఘాతుకం.'' (అబూదావూద్)

దైవప్రవక్త (స) హితోక్తి: "ప్రజలను నవ్వించడానికి అబద్ధాలు చెప్పేవాడికి వినాశం తప్పదు, వినాశం తప్పదు, వినాశం తప్పదు.'' (తిర్మిజి)

దైవప్రవక్త (స) ఎప్పుడు ప్రసంగించినా అందులో "ఎవరిలో నిజాయితీ లేదో అతనిలో విశ్వాసం లేదు; ఎవరికి ప్రతిజ్ఞ, ప్రమాణాల పట్ల గౌరవం లేదో అతనిలో ధర్మం లేదు" అని తప్పక చెబుతుండే వారు. (మిష్కాత్)

"వాగ్దానం నెరవేర్చండి. వాగ్దానం గురించి మీరు తప్పనిసరిగా (దేవుని ముందు) సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది." (ఖుర్ఆన్–17:34)

మహాప్రవక్త (స) వివిధసందర్భాలలో ఇలా ప్రవచించారు :-

"ఒకవ్యక్తి దుర్మార్గుడని తెలిసి కూడా ఎవరైనా అతడ్ని సమర్థిస్తే అలాంటివాడు ఇస్లాం నుండి బయటికి వెళ్ళిపోయినట్లే." (మిష్కాత్)

"అధర్మం, అక్రమ పనులలో తన తెగ (కులం, జాతి, వర్గం)వారికి సహకరించేవాడు బావిలో పడిపోతున్న ఒంటె తోక పట్టుకొని ఆ ఒంటెతో పాటు తానూ బావిలో పడిపోయే వ్యక్తి లాంటివాడు." (అబూదావూద్)

"మీలో ఎవరికైనా నిలబడినప్పుడు కోపంవస్తే వెంటనే కూర్చోవాలి. దానివల్ల కోపం చల్లారితే సరి; లేకుంటే పడుకోవాలి." (మిష్కాత్)

"కుస్తీపట్టి ఇతరులను చిత్తుచేసేవాడు పరాక్రమశాలి కాదు. ఆగ్రహం వచ్చినప్పుడు నిగ్రహించుకునేవాడే నిజమైన పరాక్రమశాలి. (బుఖారీ)

"ఎవరు తన కోపాన్ని అణచుకుంటాడో దేవుడు అతనికి విధించే తన శిక్షను నిలిపి వేస్తాడు." (తబ్రాని)

"కోపం ప్రదర్శించే శక్తి ఉండికూడా కోపాన్ని దిగమింగేవాడ్ని దేవుడు ప్రళయదినాన సృష్టిరాసులందరి ముందుకు పిలిచి (స్వర్గంలోని) విశాలాక్షు లైన సుందరాంగుల్లో నీకు నచ్చిన సుందరాంగిని ఎంపిక చేసుకోవచ్చ"ని అంటాడు. (తిర్మిజీ)

షైతాన్ ఎల్లప్పుడూ ఏదో ఒక వంకతో మానవుడ్ని రెచ్చగొట్టి, కోపం తెప్పించి అతనిచేత ధర్మవ్యతిరేక కార్యాలు చేయించడానికి ప్రయత్నిస్తాడు. అలాంటి పరిస్థితిలో వాడి కీడు నుండి దైవాన్ని శరణుకోరుకోవాలి.



ఒకసారి దైవప్రవక్త (స) దగ్గర హజ్రత్ అబూబకర్ (రజి) కూర్చొని ఉంటే ఒకతను వచ్చి అబూబకర్ (రజి)ని అనవసరంగా దూషించడం ప్రారంభించాడు. హజ్రత్ అబూబకర్ (రజి) వెంటనే రెచ్చిపోకుండా మౌనం వహించి అతని దూషణలు వినసాగారు. దైవప్రవక్త (స) ఆయన్ను చూసి చిరునవ్వు చిందించసాగారు. కాని తర్వాత కాస్సేపటికి అబూబకర్ (రజి) అతని దూషణలు సహించలేక సమాధానంగా ఒక తీవ్రమైన మాటన్నారు. ఆయన నోట ఆ మాట వినగానే ప్రవక్త (స) ముఖారవిందం ముడుచుకు పోయింది. ఆయన తక్షణమే లేచి అక్కడ్నుంచి వెళ్ళిపోయారు.

అబూబకర్ (రజి) కూడా లేచి ఆయన వెనకాలే నడిచారు. దారిలో ఆయన దైవప్రవక్త (స)తో మాట్లాడుతూ "(ఏమిటీ మీ ధోరణి) చాలా విచిత్రంగా ఉందే! ఆ వ్యక్తి నన్ను తిడ్తున్నంత సేపు మీరు మౌనంగా ఉండి చిరునవ్వు నవ్వుతుండేవారు. కాని తర్వాత నేనతని దూషణకు జవాబివ్వగానే మీకు కోపం వచ్చేసింది" అని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "నువ్వు మౌనంగా ఉన్నంతసేపు ఒక దైవదూత నీదగ్గర నిలబడి నీ తరఫున అతని దూషణలకు జవాబిచ్చాడు. కాని నీవు మాట్లాడటం మొద లెట్టగానే ఆదూత అదృశ్యమై అతని స్థానంలో షైతాన్ ప్రత్యక్షమయ్యాడు. మరి నేను షైతాన్‌తో కలసి కూర్చోలేనుగా?" అన్నారు. (ముస్నద్అహ్మద్)

దైవప్రవక్త (స) ప్రవచనం : "దేవుడు తన దాసుల్లో జాలిగుండెలు గల వారిపైనే జాలిచూపుతాడు." (బుఖారీ, ముస్లిం); "ప్రజలపై దయజూపని మనిషిపై దేవుడు కూడా దయజూపడు." (బుఖారీ)

దైవప్రవక్త (స) హితోక్తి : "భూవాసులపై దయజూపండి, ఆకాశంలో ఉన్నవాడు మీపై దయజూపుతాడు." (బుఖారీ); "మీరు ఇతరులపై దయ జూపండి; దేవుడు మీపై దయజూపుతాడు. మీరు ఇతరుల తప్పులు క్షమించండి; దేవుడు మీ తప్పులు క్షమిస్తాడు." (ముస్నద్అహ్మద్)

దైవప్రవక్త (స) హితోక్తి : "మన పిల్లలను కరుణించని, మన పెద్దలను గౌరవించనివాడు మనవాడు కాదు" (తిర్మిజి)

"విశ్వాసులారా! మితిమీరిన అనుమానాలకు పోకండి. కొన్ని అనుమానాలు పాపాలుగా పరిణమించవచ్చు. (అలాగే ప్రజల) రహస్యవిషయాల వెనుక పడకండి. మీలో ఎవరూ ఇతరుల్ని పరోక్షంగా నిందించకూడదు. మీలో ఎవరైనా మీ మృతసోదరుని మాంసం తినడానికి ఇష్టపడతారా? (ఏమాత్రం ఇష్టపడరు.) చూశారా, మీరే దాన్ని అసహ్యించుకుంటారు. దేవునికి భయపడండి. దేవుడు ఎంతో క్షమాశీలి, దయామయుడు." (ఖుర్ఆన్-49:12)

ఒక వ్యక్తిలో ఏదైనా చెడు ఉన్నట్లు అనుమానం వస్తే దాన్ని గురించి ఆరా తీయడానికి ప్రయత్నించకూడదని ఈ సూక్తి తెలియజేస్తోంది. హజ్రత్ ఉమర్ (రజి) పాలనాకాలంలో ఓసారి అర్థ రాత్రివేళ ఒక వ్యక్తి తన ఇంట్లో ఏదో పాట పాడుతున్నాడు. ఆ పాట వినగానే గస్తీ తిరుగుతున్న హజ్రత్ ఉమర్ (రజి)కు అనుమానం వచ్చింది. ఆయన వెంటనే అతని ఇంటి గోడెక్కి తొంగిచూస్తే మందూ, మగువా కన్పించాయి. ఆయన కోపంతో "ఓరి దైవ విరోధీ! నీవు దేవుని ఆజ్ఞలను ఉల్లంఘిస్తుంటే ఆయన నీ గుట్టు రట్టు చేయడని భావించావా?" అని అరిచారు.

దానికా వ్యక్తి ఇలా అన్నాడు: "విశ్వాసుల నాయకా! తొందరపడకండి. నేను ఒక పాపం చేస్తే మీరు మూడుపాపాలు చేశారు. దేవుడు ఇతరుల రహస్యాలు కూపీ తీయడాన్ని నిషేధించాడు. కాని మీరా పని చేశారు. దేవుడు ఇండ్లలోకి ముఖద్వారం గుండా ప్రవేశించమని ఆదేశిస్తే మీరు ప్రహరీ గోడెక్కి వచ్చారు. దేవుడు ఇతరుల ఇండ్లలోకి వారి అనుమతి లేకుండా ప్రవేశించకూడదంటే, మీరు నా అనుమతి లేకుండానే నా ఇంట్లో ప్రవేశించారు." ఉమర్ (రజి) ఈమాట విని తప్పు ఒప్పుకున్నారు. అతనిపై ఎలాంటిచర్య తీసుకోలేదు. కాకపోతే అతనిచేత దుష్కార్యాలు మానేసి నీతిమార్గం అవలంబిస్తానన్న వాగ్దానం చేయించుకున్నారు.

దైవప్రవక్త (స) ఓసారి "పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైన పాపం" అన్నారు. అనుచరులు ఈమాట విని "దైవప్రవక్తా! పరోక్షనింద వ్యభిచారం కన్నా నీచమైన పాపం ఎలా అవుతుంది?" అని అడిగారు. దానికి ఆయన



సమాధానమిస్తూ "మనిషి వ్యభిచారం చేసిన తరువాత పశ్చాత్తాపంతో క్షమాపణ కోరుకుంటే దేవుడు అతడ్ని క్షమిస్తాడు. కాని పరోక్షనిందకు పాల్పడినవాడ్ని నిందితుడు క్షమించనంత వరకు దేవుడు అతడ్ని క్షమించడు" అని వివరించారు (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి : "పరోక్షనిందకు పరిహారంగా నీవు నిందించిన మనిషి (చనిపోయినప్పుడు లేదా మరేదైనా కారణం వల్ల క్షమాపణ చెప్పడం సాధ్యం కానప్పుడు అతని) కోసం మన్నింపు ప్రార్థన చేయాలి." (మిష్కాత్)

దైవప్రవక్త (స) హితోక్తి: "చాడీలు చెప్పేవాడు స్వర్గానికి పోలేడు." (బుఖారీ)

## ప్రాణత్యాగం (జిహాద్)-13

"దేవుడు విశ్వాసుల నుండి వారి 'ధన-ప్రాణాలను' కొనుగోలు చేశాడు. వాటికి బదులుగా వారికోసం స్వర్గం సిద్ధపరచి ఉంచాడు. వారు దైవమార్గంలో పోరాడుతూ హతమార్చుతారు లేక హతమార్చబడతారు." (వారికి స్వర్గం లభిస్తుందని) తౌరాత్‌లో, ఇన్జీల్‌లో, ఖుర్ఆన్‌లో వాగ్దానం ఉంది. దాన్ని నెరవేర్చే బాధ్యత దేవునిపై ఉంది. వాగ్దానం నెరవేర్చడంలో దేవుడ్ని మించిన వారెవరుంటారు? కనుక దేవునితో మీరు చేసుకున్న ఈ వ్యాపారఒప్పందం పట్ల ఆనందోత్సవాలు జరుపుకోండి. ఇదే ఘనవిజయం. (ఖుర్ఆన్-9:111)

"వారు తమ ఇండ్ల నుంచి అన్యాయంగా వెడలగొట్టబడ్డారు. వారు "మా ప్రభువు అల్లాహ్" అన్నంత మాత్రానికే ఇలా జరిగింది. దేవుడు గనక ప్రజలను ఒకరిద్వారా మరొకరిని తుదముట్టించకపోతే, దేవుని పేరు అత్యధికంగా స్మరించబడే మఠాలు, మందిరాలు, చర్చీలు, మసీదులు, ఆరాధనాలయాలు ధ్వంసంచేయబడే ప్రమాదముంటుంది." (ఖుర్ఆన్-22:40)

"దిక్కులేకపోవడం చూసి అణచివేయబడ్డ స్త్రీలు, పురుషులు, పిల్లలను రక్షించడానికి మీరు దైవమార్గంలో ఎందుకు పోరాడరు? వారు (బాధలు భరించలేక) "దేవా! దుర్మార్గులు నివసిస్తున్న ఈనగరం నుండి మమ్మల్ని బయటికితీసి కాపాడు. మాకు రక్షణకల్పించి అండగా నిలిచేవారి నెవరినైనా

నీ వైపునుండి మా దగ్గరికి పంపు" అని మొరపెట్టు కుంటున్నారే! అలాంటి పీడితుల రక్షణ కోసం ఎందుకు పోరాడరు మీరు?" (ఖుర్‌ఆన్–4:75)

"విశ్వాసులారా! మిమ్మల్ని దుర్భరమయిన (నరక) యాతనల నుండి కాపాడగలిగే వ్యాపారపద్ధతిని గురించి మీకు తెలుపమంటారా? మీరు మనస్ఫూర్తిగా దేవుడ్ని, ఆయన ప్రవక్తను విశ్వసించి ధనప్రాణాలు ఒడ్డి దైవమార్గంలో పోరాడండి. మీరు విషయం గ్రహించగలిగితే అందులోనే మీ శ్రేయస్సు ఉంది." (ఖుర్‌ఆన్–61:10,11)

"నిజమైన విశ్వాసులు శత్రుసేనల్ని చూడగానే "దేవుడు మనకు దీన్ని గురించే వాగ్దానం చేశాడు. దేవుడు, ఆయనప్రవక్త చేసిన వాగ్దానం నిజమైనది" అన్నారు. ఈసంఘటన వారి విశ్వాసాన్ని, అంకితభావాన్ని మరింత వృద్ధిచేసింది." (ఖుర్‌ఆన్–33:22)

ముస్లింలు యుద్ధం చేసే పరిస్థితి రావాలని ఎన్నడూ కోరుకోకూడదు. యుద్ధం అనివార్యమైతే మాత్రం స్థిరంగా నిలబడి ధైర్యంగా పోరాడాలి.

"శత్రువులతో తలపడాల్సి వచ్చిన రోజుల్లో దైవప్రవక్త (స) యుద్ధం కోసం నిరీక్షించారు. సూర్యుడు నడినెత్తి నుండి క్రిందికి వాలిన తరువాత జనం మధ్య నిలబడి ఇలా ప్రసంగించారు: 'ప్రజలారా! మీరు ఎన్నడూ శత్రువుతో తలపడాల్సిన పరిస్థితి రావాలని కోరుకోకండి. నిత్యం శాంతినే కోరుకుంటూ దైవాన్ని ప్రార్థించండి. అయితే శత్రువులతో యుద్ధం చేయవలసిన పరిస్థితి వస్తే మాత్రం సహన స్థయిర్యాలతో పోరాడండి. స్వర్గం ఖడ్గచ్ఛాయల క్రింద ఉందన్న సంగతి తెలుసుకోండి.' తర్వాత దైవప్రవక్త (స) ఇలా ప్రార్థించారు: 'దేవా! దివ్యగ్రంథాన్ని అవతరింపజేసినవాడా! మేఘాలను నడిపించేవాడా! శత్రుసేనలను ఓడించినవాడా! ఈ శత్రువుల్ని కూడా ఓడించి వీరికి వ్యతిరేకంగా మాకు సహాయపడు." (బుఖారీ, ముస్లిం)

"(విశ్వాసులారా!) బాధపడకండి. అధైర్యంతో క్రుంగిపోకండి. మీరు నిజమైన విశ్వాసులైతే చివరికి మీరే విజయం సాధిస్తారు. (సత్యాసత్యాల



సమరంలో) మీరేకాదు, వారు కూడా దెబ్బతిన్నారు. ఇవన్నీ మేము ప్రజల మధ్య తిప్పే కాలపు మిట్టపల్లాలు మాత్రమే. ఆయన మీలో నిజమైన విశ్వాసు లెవరో పరీక్షించడానికి, కొందరిని సత్యానికి సాక్షులు (అమరగతులు)గా చేయడానికి ఈవిధంగా చేశాడు." (ఖుర్‌ఆన్–3:139,140)

దైవప్రవక్త (స) హితోక్తి : "అమరగతుడైన ఒక్క వీరయోధుడు తప్ప స్వర్గంలో ప్రవేశించిన ఏవ్యక్తి కూడా ప్రపంచంలోని సంపదలన్నీ ఇవ్వబడతా యన్నా, మళ్ళీ ఇహలోకానికి పోవడానికి ఇష్టపడడు. అమరగతుడైన వీరయోధుడు అమరగతి (షహాదత్)కి సంబంధించిన గౌరవోన్నతులు చూసి వుంటాడు గనక, అతను తిరిగి ఇహలోకానికి వెళ్ళి (దైవమార్గంలో) పది సార్లు అయినా వీరమరణం పొందాలని కోరుకుంటాడు." (బుఖారి)

"ఇంతకు పూర్వం ఎంతోమంది దైవప్రవక్తలు గతించారు. వారితో కలసి దైవభక్తులు ప్రాణాలొడ్డి పోరాడారు. అప్పుడు దైవమార్గంలో ఎదురైన కష్టాల వల్ల వారు ధైర్యం కోల్పోలేదు. పిరికిచర్యలకు పాల్పడి అధర్మానికి తల వంచనూ లేదు. అలాంటి స్థిరచిత్తులనే దేవుడు ప్రేమిస్తాడు. పైగా వారు 'ప్రభూ! మా తప్పులు మన్నించు. నీ మార్గంలో మేమేదైనా హద్దుమీరి ఉంటే దాన్ని కూడా క్షమించు. మా కాళ్ళకు స్థిరత్వం చేకూర్చి అవిశ్వాసులపై మాకు విజయం ప్రసాదించు.' అని వేడుకున్నారు. కనుక దేవుడు వారికి ప్రపంచంలో తగిన ప్రతిఫలం ఇచ్చాడు; పరలోకంలో అంతకంటే ఎంతో శ్రేష్ఠమైన ప్రతిఫలం ప్రసాదిస్తాడు." (ఖుర్‌ఆన్–3:146–148)

మహాప్రవక్త మహితోక్తి : "మనస్ఫూర్తిగా అమరగతినొందే భాగ్యం ప్రసాదించమని వేడుకునేవారు పడకల మీద మరణించినా సరే దేవుడు వారిని అమరగతుల స్థాయికి చేరుస్తాడు." (ముస్లిం)

"మీపై దాడిచేయడానికి అవిశ్వాసులు పెద్దఎత్తున సైన్యాలు సమీకరిస్తున్నారు, వారికి భయపడండి' అని జనం అన్నప్పుడు వారు ద్విగుణీకృత విశ్వాసంతో 'మాకు దేవుడే చాలు, ఆయన గొప్ప కార్యసాధకుడు' అని సమాధానమిచ్చారు. చివరికి వారు దేవుని అనుగ్రహంతో, బహుమానాలతో

తిరిగివచ్చారు. వారికి ఎలాంటి నష్టం జరగలేదు. వారు దేవుని అభీష్టం ప్రకారం నడుచుకున్నారు." (ఖుర్ఆన్-3:172,173)

దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "జిహాద్ చేయకుండా, కనీసం జిహాద్ చేయాలన్న ఆలోచన కూడా లేకుండా మరణించిన వ్యక్తి ఒక కపట లక్షణం తో మరణించిన వాడవుతాడు." (ముస్లిం)

దైవప్రవక్త (స) ప్రవచనం: "పరమ శుభదాయకుడైన దేవుని మార్గంలో మీకు దగ్గరలో ఉన్నా, దూరంగా ఉన్నా ప్రతి శత్రువుతో పోరాడండి. దైవధర్మం విషయంలో ఎవరి విమర్శలనూ ఖాతరు చేయకండి. మీరు స్వస్థలంలో ఉన్నా, ప్రయాణావస్థలో ఉన్నా సరే దైవశిక్షలను అమలు పరచండి. జిహాద్ (పోరాటం) స్వర్గద్వారాలలో ఓ మహోన్నతమైన ద్వారం. కనుక మీరు దైవమార్గంలో పోరాటం జరుపుతూ ఉండండి. దైవమార్గంలో చేసే పోరాటం ద్వారానే దేవుడు మానవుల్ని విచారం, ఆందోళనల నుండి విముక్తి కలిగిస్తాడు." (ముస్నద్ అహ్మద్)

"నీ దగ్గరకు వచ్చి వాహన సౌకర్యం కల్పించమని మనవి చేసుకున్నవారి విషయంలో ఎలాంటి ఆక్షేపణ లేదు. వారి విజ్ఞప్తికి సమాధానంగా 'మీకు నేను వాహన సౌకర్యాలు కల్పించలేను' అన్నావు నీవు. అప్పుడు వారు గత్యంతరంలేక అశ్రుపూరిత నయనాలతో వెళ్ళిపోయారు. సొంత ఒనరులతో ధర్మపోరాటంలో పాల్గొనే భాగ్యం తమకు లేకపోయిందే అని వారు ఎంతగానో బాధపడ్డారు." (ఖుర్ఆన్-9:91,92)

అనేక మంది ప్రజలు ఖడ్గం లేక తుపాకితో జరిపే పోరాటాన్నే జిహాద్ అనుకుంటారు. ఇది చాలా పొరపాటు. ఈనాడు హక్కుల కోసం ప్రసంగాలు, ప్రదర్శనలు, కరపత్రాల, మొదలైన శాంతియుత సాధనాలతో కృషి చేసే సంఘాలను 'పోరాటసమితి, పోరాటసంఘాల పేర్లతో పిలుస్తున్నారు. అలాగే ఇస్లాంలో కూడా మంచిని వ్యాపింపజేసే, చెడును అరికట్టే లక్ష్యం కోసం చేసే ఇలాంటి పనులు కూడా జిహాద్ కిందికే వస్తాయి.



దైవప్రవక్త (స) జీనుపై కాలుపెడ్తున్నపుడు ఒకతను వచ్చి "అన్నింటి కంటే శ్రేష్ఠమైన జిహాద్ (పోరాటం) ఏద"ని అడిగాడు. దానికి దైవప్రవక్త (స) "నిరంకుశుడైన రాజు ముందు సత్యాన్ని చాటి చెప్పటమే శ్రేష్ఠమైన జిహాద్" అని సమాధానమిచ్చారు. (నసాయి)

దైవప్రవక్త (స) ఒక యుద్ధం నుండి తిరిగొచ్చిన యోధులతో "మీరు చిన్న జిహాద్ నుండి పెద్ద జిహాద్ వైపుకు తిరిగొచ్చారు" అని అన్నారు. అనుచరులు ఈమాట విని 'ఆ పెద్దజిహాద్ ఏమిట'ని అడిగారు. దానికి దైవప్రవక్త (స) "మనిషి తన మనోవాంఛలకు వ్యతిరేకంగా పోరాడటమే పెద్ద జిహాద్" అన్నారు. (కన్జుల్అమ్మాల్, దుర్రెమన్సూర్)

దైవప్రవక్త (స) హితోక్తి: "పేదలు, వితంతువుల బాగోగుల కోసం కృషి చేసేవాడు దైవమార్గంలో జిహాద్ చేసే యోధుడితో సమానం." (బుఖారీ)

## ధర్మప్రచారం, సమాజసంస్కరణ-14

"విశ్వాసులారా! ఇకనుండి ప్రపంచ మానవులకు మార్గదర్శనం చేస్తూ వారిని సంస్కరించడానికి రంగంలోకి తీసుకురాబడిన శ్రేష్ఠసమాజం మీరే. మీరు మంచిపనులు చేయమని ప్రజలను ఆదేశిస్తారు. చెడుల నుండి వారిస్తారు." (ఖుర్ఆన్-3:110)

"మీలో ఒక వర్గం (ప్రజల్ని) మంచి వైపునకు పిలిచేవారు, సత్కార్యాలు చేయమని ఆజ్ఞాపించేవారు, చెడుపనుల నుండి వారించేవారు తప్పకుండా ఉండాలి. అలాంటివారే సాఫల్యం చెందేవారు." (ఖుర్ఆన్-3:104)

ఖుర్ఆన్ ప్రజలలో దైవభీతి, పరలోకచింతనలు కలిగించి తద్వారా వారిని నీతిమంతులుగా, సత్పౌరులుగా తీర్చిదిద్దగోరుతోంది. వివిధ చెడుల్ని నిర్మూలించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నెలకొల్ప దలచింది. ఈ లక్ష్యం కోసం ఖుర్ఆన్ ముస్లింలపై మంచినిపెంచే, చెడును త్రుంచే పని నిర్బంధం చేసింది. దీనికోసం ముస్లింలలో ఒక వర్గం వ్యవస్థీకృత సంఘంగా ఏర్పడాల్సిన ఆవశ్యకత ఉందని చెబుతోంది. ముఖ్యంగా ధార్మిక, సామాజిక

స్పృహ కలిగిన ముస్లింలపై చెడును త్రుంచే, మంచిని పెంచే బాధ్యత మరింత అధికమవుతుంది. ఈ పని నిర్వహించకపోతే సమాజ పతానానికి దేవుని సమక్షంలో ప్రధానబాధ్యులు వారే అవుతారు.

దైవప్రవక్త (స) ఈ విషయాన్ని ఓ తార్కాణంతో ఇలా వివరించారు: "దేవుడు, ఒక ఊరిని ఆ ఊరిప్రజలతో సహా తల్లక్రిందులు చేయమని దైవదూత జిబ్రీల్ (అలై)ని ఆజ్ఞాపించాడు. జిబ్రీల్ (అలై) ఆ ఊరిని చూసి వచ్చి 'ప్రభూ! అక్కడ ఒక్కక్షణం కూడా నీకు అవిధేయత చూపని నీ దాసుడు కూడా ఒకడున్నాడు కదా (నేనెలా ఆ ఊరిని శిక్షించను)?' అని అన్నారు. 'కాని నా ధర్మం అగౌరవం, అపచారాలకు గురవుతుంటే అతని ముఖం ఏనాడూ (ఆగ్రహంతో) జేవురించ లేదు. కనుక ఇతరులతో పాటు అతడ్ని కూడా కలిపి మొత్తం ఊరిని తల్లక్రిందులు చేసెయ్యి' అని దేవుడు మళ్ళీ ఆదేశించాడు." (మిష్కాత్)

సమాజమంతా భ్రష్టుపట్టి పోయినప్పుడు, దాన్ని సంస్కరించడానికి కృషి చేయకుండా వ్యక్తిగత సత్కార్యాల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని ఈ హదీసు వివరిస్తోంది. అంతేకాదు, అలాంటి భ్రష్టసమాజంపై విరుచుకుపడే దైవశిక్ష నుండి వ్యక్తిగత సత్కార్యాలతో తృప్తిపడే ముస్లింలు కూడా తప్పించుకోలేరని ఇది ప్రస్ఫుటం చేస్తోంది. దైవప్రవక్త (స) సంఘసంస్కరణ ప్రాముఖ్యం తెలుపుతూ పలికిన పలుకులు చూడండి:

"నాప్రాణం ఏ శక్తిస్వరూపుని అధీనంలో ఉందో ఆ దేవుని సాక్షి! మీరు (ప్రజలను) సత్కార్యాలు చేయమని ఆదేశించే, దుష్కార్యాల నుంచి వారించే పనైనా చేయాలి. లేదా దేవుడు మీపై శిక్షనైనా దించుతాడు. అప్పుడు మీరు ఎంత మొరపెట్టుకున్నా ఆయన మీ మొరలు ఏమాత్రం ఆలకించడు." (మిష్కాత్)

"ఏజాతిలో చెడులు ప్రబలుతాయో ఆ జాతి సంస్కరణ సామర్థ్యం కల వారు దాన్ని సంస్కరించకపోతే దేవుడు ఆ జాతిప్రజలందరిపై ఏదైనా శిక్ష దించే సమయం ఆసన్నమైందని వారు తెలుసుకోవాలి." (మిష్కాత్)



దైవప్రవక్త (స) ప్రవచనం: "మీలో ఎవరైనా సమాజంలో ఏదైనా చెడ్డ పని చూసినప్పుడు దాన్ని అతను చేత్తో నిరోధిస్తే, దేవుని దగ్గర జవాబుదారీ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. అంతటి శక్తి లేనివాడు ఆ చెడుకు వ్యతిరేకంగా గళంవిప్పి అరికట్టేందుకు ప్రయత్నిస్తే అతను కూడ ఆ బాధ్యత నుండి తప్పించుకుంటాడు. గళంవిప్పి నిరోధించే శక్తి కూడా లేనివాడు కనీసం మనసులోనైనా ఆ చెడుని అసహ్యించుకుంటే అతను కూడా జవాబు దారీబాధ్యత నుండి తప్పించుకుంటాడు. ఈ(చివరి) వైఖరి అన్నిటి కంటే అత్యల్పస్థాయి విశ్వాసం (ఈమాన్) క్రిందికి వస్తుంది." (నిసాయి)

"విశ్వసించిన స్త్రీ పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. వారు (ప్రజలకు) మంచివిషయాలు బోధిస్తారు. చెడువిషయాల నుండి వారిస్తారు. నమాజ్ (వ్యవస్థ) స్థాపిస్తారు. జకాత్ నెరవేరుస్తారు. దేవునిపట్ల, ఆయన ప్రవక్తపట్ల వినయవిధేయతలతో మసలుకుంటారు. వీరిపైన్నే దైవకారుణ్యం వర్షిస్తుంది." (ఖుర్ఆన్-9:71)

## పరలోక బాటసారి ప్రపంచంలో-15

ఇహలోకం తాత్కాలికమైనది. మన అసలుజీవితం మరణానంతరమే మొదలవుతుంది. అదే పరలోకజీవితం. పరలోక సాఫల్య, వైఫల్యాలు ఇహలోకంలో మనం ఆచరించే కర్మల్నిబట్టే ఉంటాయి. పరలోక సాఫల్యం పొందడానికి ఇహలోకంలోనే పాటుపడటం బుద్ధిమంతుని లక్షణం.

"ఇహలోకంలో మీకివ్వబడిన జీవనసామగ్రి మూన్నాళ్ళముచ్చట మాత్రమే. దేవుని దగ్గర ఉన్నదే శ్రేష్ఠమైనది, శాశ్వతమైనది. అయితే సత్యాన్ని విశ్వసించి తమ ప్రభువును నమ్ముకున్నవారికే ఇది లభిస్తుంది." (ఖుర్ఆన్-42:36)

దైవప్రవక్త (స) హితోక్తి : "మీరు సముద్రంలో వ్రేలు ముంచితీస్తే దానికి ఎంత నీరంటుతుందో పరలోకజీవితం ముందు ఇహలోకజీవితం కూడా అంతే!" (ముస్లిం); "దేవునిదృష్టిలో ఈ లోకానికి దోమరెక్కంత విలువున్నా ఆయన అవిశ్వాసులకు గుక్కెడునీళ్ళు కూడ తాగించేవాడు కాదు." (తిర్మిజీ)

హ(జత్ జాబిర్ (రజి) కథనం: ఒకసారి దైవప్రవక్త (స) ఓ బజారున వెళుతున్నారు. ఆయన ఇరుప్రక్కలా జనం ఉన్నారు. అలా వెళుతూ ఆయన పొట్టి చెవులుగల ఒక చచ్చిన మేకపిల్లను చూశారు. దాని చెవి పట్టుకొని అక్కడున్నవారితో "మీలో ఎవరైనా దీన్ని ఒక్క దిర్హంకైనా కొనటానికి ఇష్ట పడతారా?" అని అడిగారు. దానికి వారు "(ఒక్క దిర్హం కాదుకదా) దానికన్నా తక్కువ ఖరీదుకు కూడా మేము దాన్ని తీసుకోము. ఒకవేళ తీసుకున్నా దాన్ని మేమేం చేసుకుంటాం?" అని అన్నారు. "ఒకవేళ ఉచితంగా లభిస్తే తీసుకో వటానికి ఇష్టపడతారా?" అని మళ్ళీ అడిగారు దైవప్రవక్త (స). దానికి వారు "దైవసాక్షి! ఇది బ్రతికున్నా దీనిలో లోపం ఉంది. దీని చెవులు పొట్టిగా ఉన్నాయి. అయినా చచ్చిపోయినదాన్ని మేము ఏం చేసుకుంటాం?" అని అన్నారు. అప్పుడు ఆయన "దైవసాక్షి! మీరీ మేకపిల్లను ఎంత తుచ్ఛమైనదిగా భావిస్తున్నారో దేవుని దృష్టిలో ఈ లోకం అంతకన్నా తుచ్ఛమైనది" అని చెప్పారు. (ముస్లిం)

మహాప్రవక్త (స) మహితోక్తి : "విశ్వాసికి ప్రపంచం చెరసాల వంటిది. అవిశ్వాసికి స్వర్గం లాంటిది." (ముస్లిం)

హ(జత్ అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి) ఉల్లేఖనం : దైవప్రవక్త (స) ఒకసారి నా భుజమ్మీద చెయ్యి వేసి ఇలా ఉపదేశించారు- "ప్రపంచంలో నువ్వు ఒక అపరిచిత వ్యక్తిలా, బాటసారిలా జీవితం గడుపు. సాయంత్రం గడిపిన తరువాత ఉదయం కోసం ఎదురుచూడకు. ఉదయం గడిపిన తరువాత సాయంత్రం కోసం ఎదురుచూడకు. వ్యాధికి పూర్వం ఆరోగ్యాన్ని, మరణా నికి పూర్వం జీవితాన్ని మహాభాగ్యాలుగా భావించు." (బుఖారి)

దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు: "ప్రపంచాన్ని ప్రేమించేవాడు తన పరలోకాన్ని నాశనం చేసుకుంటాడు; పరలోకాన్ని ప్రేమించేవాడు తన ప్రపంచాన్ని నష్టపరచుకుంటాడు. కనుక ప్రజలారా! మీరు అంతమైపోయే (ఐహిక) జీవితం కంటే శాశ్వతంగా ఉండే (పరలోక) జీవితానికి అత్యధిక ప్రాధాన్యం ఇవ్వండి." (మిష్కాత్)



దైవప్రవక్త (స) హితోక్తి: "ఈ ప్రపంచం మధురమైనది, సస్యశ్యామల మైనది. నిజానికి దేవుడు మిమ్మల్ని ఈ ప్రపంచంలో తన ప్రతినిధులుగా పుట్టించి, మీరు ఎలా పని చేస్తారోనని పరీక్షిస్తున్నాడు. కనుక మీరు ప్రాపంచిక (మాయల) విషయంలో, స్త్రీల (ద్వారా ఎదురయ్యే పరీక్షల) విషయంలో అప్రమత్తంగా ఉండండి." (ముస్లిం)

హ(జత్ అమ్ బిన్ ఔఫ్ అన్సారీ (రజి) కథనం: .....దైవప్రవక్త (స) ఇలా ప్రవచించారు- "దైవసాక్షిగా చెబుతున్నాను. మీరు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్న భయం నాకు లేదు. కాని గత సమాజాలకు మాదిరిగా మీక్కూడా పుష్కలంగా ప్రాపంచిక సిరిసంపదలు లభిస్తే మీరూ వారిలాగే ప్రాపంచిక వ్యామోహంలో పోటీ పడతారేమోనని నాకు భయంగా ఉంది. అలా చేస్తే ఈ ప్రాపంచిక వ్యామోహం గత సమాజాలను నాశనం చేసినట్లు మిమ్మల్ని కూడా నాశనం చేయవచ్చు." (బుఖారి, ముస్లిం)

దైవప్రవక్త (స) తన అనుచరులకు హితోపదేశం చేస్తూ "ఆకలిగొన్నవారు భోజన కంచాలపై విరుచుకుపడినట్లు నా అనుచరసముదాయంపై ఇతర జాతులు విరుచుకుపడతాయి. ఆ కాలం త్వరలో రానున్నది" అని అన్నారు. ఒక అనుచరుడు ఈమాట విని "ఆ కాలంలో ఇతర జాతులు సమైక్యమయి మమ్మల్ని అంతమొందించే ఉద్దేశంతో మాపై విరుచుకుపడేందుకు మా ముస్లింల జనాభా మరీఅంత తక్కువగా ఉంటుందా?" అని అడిగాడు.

దానికి దైవప్రవక్త (స) ఇలా అన్నారు: "తక్కువేమీ ఉండదు. ఆ కాలంలో మీరు అత్యధిక సంఖ్యలో ఉంటారు. కాని మీరప్పుడు వరదనీటి నురుగులా ఉంటారు. మీ శత్రువుల హృదయాల్లో మీపట్ల ఉండే భయం పోతుంది. మీ హృదయాల్లో పిరికితనం గూడుకట్టుకొని ఉంటుంది." ఒకతను ఈమాట విని "దైవప్రవక్తా! ఆ పిరికితనానికి కారణం ఏమిటీ?" అనడిగాడు. దానికి దైవప్రవక్త (స) "మీరు ప్రాపంచిక వ్యామోహపరులైపోతారు. (ధర్మ సంస్థాపన కోసం ప్రాణత్యాగం చేయడానికి బదులు) మీరు చావును అసహ్యించుకొని దాన్నుండి పారిపోతారు" అని చెప్పారు. (అబూదావూద్)

## విశ్వాసుల విశిష్ఠ గుణాలు-16

✼ వారు దేవునితో చేసిన ప్రమాణాన్ని నెరవేరుస్తారు. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ భంగపరచరు. (13:20); వారు తమ అప్పగింతలు, ప్రమాణాలు, ఒప్పందాల విషయంలో నిజాయితీగా వ్యవహరిస్తారు. (23:8)

✼ వారు ఎల్లప్పుడూ తమ ప్రభువుకు భయపడుతుంటారు. కఠినంగా (కర్మ) విచారణ జరుగుతుందేమోనని భయపడుతుంటారు. (13:21)

❀ వారు ప్రార్థనా వ్యవస్థ స్థాపిస్తారు. (13:21); తమ నమాజులో ఎంతో అణుకువ, నమ్రతలు పాటిస్తారు. (23:1,2); తమ నమాజులను క్రమం తప్పకుండా, నియమబద్ధంగా పాటిస్తారు. (23:9)

❀ వారు రాత్రిళ్లు మేల్కొని దైవారాధనలో గడుపుతారు.(32:14);

❀ వారు ప్రతిరోజూ తెల్లవారుజామున లేచి (తమ ప్రభువును) క్షమాపణ కోరుకునేవారు. (51:18)

❀ వారు ఆశతో భయంతో తమ ప్రభువును వేడుకుంటారు. (32:15)

✦ మేము ప్రసాదించిన ఉపాధినుండి (సత్కార్యాలకోసం) రహస్యంగాను, బహిరంగంగాను ఖర్చుపెడతారు. (13:22); వారు కలిమిలోనూ, లేమిలోనూ తమ సంపదను (దైవమార్గంలో) ఖర్చుపెడతారు.(3:134)

✦ వారి సంపదలో అర్థించేవారికి, అర్థించనివారికి ఒక నిర్ణీతభాగం ఉంటుంది. (51:19) వారు దేవుని మీదుండే ప్రేమపారవశ్యంతో నిరుపేదలకు, అనాథలకు, ఖైదీలకు అన్నదానం చేస్తారు. (76:8);

✦ వారు తమ సంపద నుండి (పేదలహక్కు) జకాత్ చెల్లిస్తారు. (23:4)

✦ తమ సంపద వినియోగిస్తున్నప్పుడు దుబారా చేయరు; పిసినారితనం వహించరు. వారి ఖర్చు ఆ రెండుచర్యలకు మధ్యస్తంగా ఉంటుంది. (25:67)

☯ వారు అహంకారంతో విర్రవీగరు. (32:14)

☯ నమాజుస్థాపన, జకాత్‌చెల్లింపు విధుల నిర్వహణ నుండి వ్యాపార వ్యవహారాలు వారిని ఎన్నటికీ విస్మరింపజేయలేవు. (24:37)



❖ వారు మంచిని బోధిస్తారు, చెడులను నివారిస్తారు. దైవనిర్ణీత హద్దులు కాపాడుతారు. (9:112); చెడుని మంచిద్వారా నిర్మూలిస్తారు. (13:22)

❖ మూర్ఖులు వారితో వాదనకు దిగితే 'మీకు సలాం' అంటారు. (25:63)

❖ పనికిమాలిన విషయాలకు చాలా దూరంగా ఉంటారు. (23:3); ఎప్పుడైనా పనికిమాలిన వ్యవహారంమీదుగా పోవలసివస్తే దాన్ని పట్టించుకోకుండా హుందాగా, గౌరవప్రదంగా దాటివెళ్తారు. (25:72)

❈ వారు తమవల్ల ఏదైనా నీతిమాలిన పనిగాని, లేదా మరేదైనా పాప కార్యంగాని జరిగిపోతే వెంటనే దేవుణ్ని స్మరించి క్షమాపణ చెప్పుకుంటారు. అంతేగాని, తాము చేసిన దానిపై మంకుపట్టు పట్టరు... (3:135,136)

❈ వారు తమ భార్యలు, బానిసస్త్రీల విషయంలో తప్ప (ఇతరస్త్రీల విషయంలో) తమ మర్మావయవాలు కాపాడుకుంటారు. (23:7)

✇ వారు కష్టాలు వచ్చినప్పుడు సహనం వహిస్తారు. (22:35)

✇ కోపోద్రేకాలు కలిగినప్పుడు (వాటిని దిగమింగి) క్షమిస్తారు. (42:37)

✇ వారిపై ఎవరైనా దౌర్జన్యంచేస్తే వారు దాన్ని ఎదుర్కొంటారు. (42:39)

✇ వారు పరస్పరం సలహా సంప్రదింపులతో తమ వ్యవహారాలు నడుపుకుంటారు. (42:38)

✯ వారు ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వాగ్దాన పాలకులు. (70:24)

✯ సాక్ష్యం విషయంలో నీతి,న్యాయాలకు కట్టుబడిఉండేవారు. (70:25)

☸ విశ్వసించిన స్త్రీ పురుషులంతా ఒకరికొకరు స్నేహితులు, శ్రేయోభిలాషులు. (9:71); ఓర్పు, దయాదాక్షిణ్యాల్ని గురించి ఉపదేశించుకునే విశ్వాసుల్లో చేరిపోతారు. (90:17)

☸.వారు తోటివిశ్వాసుల విషయంలో మృదువుగా, అవిశ్వాసుల విషయంలో కఠినంగా వ్యవహరిస్తారు. (5:54)

**(-సమాప్తం-)**